జగన్ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదు. టీడీపీ ప్రభుత్వం తెచ్చిన పరిశ్రమలను తరిమేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి రాష్ట్ర గౌరవం పెంచింది. చంద్రబాబు, లోకేష్ కృషి చూసి వైసీపీ నాయకులు కడుపుమంటతో కుట్రలకు దిగుతున్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 24.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 187 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

## పెట్రో కెమికల్ రంగంలో ఏపీలో అపార అవకాశాలు




**దక్షిణాసియాకు చేరువలో వ్యూహాత్మక ప్రాంతంగా ఏపీ**

**అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు**

**ఏపీలో పెట్టుబడులు పెట్టాలని టెక్ కంపెనీలకు ఆహ్వానం**

**రెండో రోజు పర్యటనలో అబుదాబి పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ**

**అబుదాబి :** దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు. యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఎ స్క్వేర్‌లో ఏడీఎన్‌ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్‌ఓసీ-ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

**అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌తోనూ భేటీ:** అబుదాబీ చాంబర్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సీఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 ఇంటర్నేషనల్ సంస్థను ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

**టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్:** అనంతరం అబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్సార్ట్స్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్ కోషి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

**రాష్ట్రంలో కోకో ఉత్పత్తి బాగుంది...**

**చాక్లెట్ పరిశ్రమ స్థాపించండి**

**అబుదాబీ పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీల్లో సీఎం**

**అబుదాబి:** యూఏఈలోని రెండోరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అబుదాబిలోని వివిధ పారిశ్రామికవేత్తలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అపెక్స్ ఇన్వెస్ట్మెంట్స్, మస్దార్, అగ్తియా గ్రూప్, లులు గ్రూప్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు విడివిడిగా భేటీ అయ్యారు. ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ ఇన్వెస్టిమెంట్ చైర్మన్ ఖలీఫా ఖౌరీ, మస్దార్ సీఈఓ మొహమ్మద్ జమీల్ అల్ రమాహీని ముఖ్యమంత్రి కోరారు. విశాఖలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని అపెక్స్, మస్దార్ సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ రంగంలో పెట్టుబడులపై అపెక్స్ ప్రతినిధులు చర్చించారు. సూపర్ కెపాసిటర్స్ రంగంలో పేరొందిన అపెక్స్ సంస్థను ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం ఆహ్వానించారు. మిగతా 2లో...

## నకిలీ మద్యంపై కఠిన చర్యలు



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** మద్యం కల్తీ చేసినా.. తప్పుడు ప్రచారానికి పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. గాజువాకలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌తో కలిసి ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మద్యం షాపులో బాటిళ్లను స్కాన్ చేశారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు.

"2014-19లోనే ట్రాక్ అండ్ ట్రేస్ తీసుకొచ్చాం. జగన్ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలను నాశనం చేసి కల్తీ మద్యం విక్రయించారు. వైకాపానే మద్యం కల్తీ చేసి ప్రభుత్వంపై నెట్టే కుట్ర చేస్తున్నారు. 80 శాతం మద్యం అమ్మకాలు డిజిటల్ పేమెంట్ల ద్వారా జరగడం పారదర్శకతకు నిదర్శనం. మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యం అమ్మిన జగన్‌కు ఈ అంశంపై మాట్లాడే అర్హత లేదు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

## కలిసి పనిచేద్దాం ఏపీ అభివృద్ధికి సహకరించండి



**ఆస్ట్రేలియా :** ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా ప్రతినిధులను కోరారు. పారామెడికల్ కోర్సులు, పాఠ్య ప్రణాళికల అభివృద్ధికి సహకరించాలంటూ అక్కడి విద్యాసంస్థలను ఆహ్వానించారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికత అంశాలు రాష్ట్ర విద్యావిధానంలో ప్రవేశపెట్టే అవకాశాలపైనా అధ్యయనం చేశారు.

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఐదవ రోజు మంత్రి విద్య, ఐటీ శాఖల నారా లోకేశ్ వివిధ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. క్వాంటమ్ పరిశోధనలు, ఉపాధ్యాయ శిక్షణపై మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్) ఉన్నతస్థాయి బృందంతో ఆయన చర్చించారు. ఏపీ ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలతో కలిసి కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికలపై స్థిరమైన పద్ధతుల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి కోరారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో...

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కి సహకారం అందించండి



**ఆస్ట్రేలియా (మెల్‌బోర్న్):** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్)ను సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్స్టన్, డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (గ్లోబల్, కల్చర్ అండ్ ఎంగేజ్ మెంట్) ప్రొఫెసర్ మైఖేల్ వెస్లీ, డీన్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ జెన్నీఫర్ బాలింట్, డీన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మారెక్ టెసార్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఐటీ ప్రొఫెసర్ అంపలవనపిళ్లై (థాస్) నిర్మలథాస్, 2లో...

## ఏపీ జాలర్లను క్షేమంగా తీసుకువస్తాం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** సముద్రంలో చేపలవేటకు వెళ్ళి, పొరపాటున బంగాదేశ్ నేవీకి చిక్కిన విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులను దేశానికి తిరిగి తీసుకువచ్చే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది. బంగ్లాదేశ్ నావికాదళం మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది.

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖతో నిరంతరం సమన్వయం చేస్తూ, ఈ విషయంలో న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా అధికారిక చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ జాయింట్ సెక్రటరీ బి. శ్యామ్‌ని సంప్రదించి, కేసు పురోగతిపై వివరాలు తెలుసుకుంది.

ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, మత్స్యకారులపై బంగ్లాదేశ్‌లో చార్జ్‌షీట్ దాఖలు కాగా ఢాకాలోని భారత హైకమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ బృందం మత్స్యకారులకు చట్టపరమైన సహాయాన్ని అందిస్తూ, వారి విడుదలకు కృషి చేస్తోంది. వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడంతో పాటు, బంగ్లాదేశ్ రాయబార కార్యాలయాన్ని కూడా సంప్రదించి అవసరమైన సహకారాన్ని అందించాలని ప్రభుత్వం కోరింది. విజయనగరం జిల్లాలోని బాధిత మత్స్యకార కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సంప్రదిస్తూ, వారికి అన్ని రకాల సహాయాన్ని అందించడానికి కృషి చేస్తోంది. 2లో...

## హైకోర్టు జడ్జిలు, మంత్రులకు అధునాతన నివాసాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంతంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో ప్రభుత్వ నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రధానంగా హైకోర్టు న్యాయమూర్తులకు, హైకోర్టులో పనిచేసే ఇతర అధికారులకు ఒక అంతస్తుతో నివాస గృహాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. నేలపాడు గ్రామంలో ప్రస్తుతం ఉన్న హైకోర్టుకు సమీపంలోనే న్యాయమూర్తుల భవనాల నిర్మాణం చేపట్టారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తుల భవనాలు, మంత్రులు, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ తదితరుల కోసం మొత్తం 76 నివాస బంగ్లాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.411 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ పనులకు బిఎస్ఆర్ కంపెనీ కాంట్రాక్టు పొందింది. ఈ నిర్మాణాలు విల్లాల తరహాలో సువిశాలంగా నిర్మిస్తున్నారు. ప్రతి భవనానికీ ముందు సెక్యూరిటీగార్డుకు, ఆఫీసుకు కూడా రూములను నిర్మిస్తున్నారు. నేలపాడులో న్యాయమూర్తులు, ఇతర అధికారుల కోసం 40 నివాస భవనాలు నిర్మిస్తుండగా, వెలగపూడిలో మరో 36 భవనాలు మంత్రులు, ఇతర ప్రముఖుల కోసం నిర్మాణాలు చేపట్టారు. మిగతా 2లో...

**నవంబర్ 1 నుంచి ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయాలు**

## ప్రక్షాళన దిశగా సహకార వ్యవస్థ

3లో

## భారీ వర్షాలు.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీఎం చంద్రబాబు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాలు పలువురు మంత్రులు వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సంబంధిత జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయడం జరిగింది.

**దుబాయ్ నుంచి సీఎం సమీక్ష:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సీఎస్ మరియు ఆర్టీజీ అధికారుల నుంచి సమాచారం సేకరించి, యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను పంపించాలని సూచిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కాలువలు మరియు చెరువుల గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని ఆదేశించారు. అంతేకాక, అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు.

**రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష:** ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో మంత్రి డా. పి. నారాయణ మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తం చేశారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కాకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా చూడాలని, నీటి పారుదలకు అడ్డంకులను తొలగించాలని, ఇంజనీరింగ్ మరియు పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో 24 గంటల కాల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలని మరియు పోలీస్, వైద్యారోగ్య శాఖ సిబ్బందితో సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

**రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష :** రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు మునిగే అవకాశం ఉండటంతో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో డ్రైనేజీలను క్లియర్ చేసి వర్షపు నీరు సకాలంలో వెళ్లేలా చూడాలని, ఇరిగేషన్ అధికారులు కట్టల వెంబడి ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మిగతా 2లో...

# వాడపల్లి ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కోనసీమ తిరుమలగా పేరొందిన పవిత్ర పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి గోదావరి గట్టు మీదుగా నేరుగా చేరుకునేందుకు వీలుగా నూతన రహదారి నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమోదం తెలిపారు. రూ.6 కోట్లు పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే వాడపల్లి క్షేత్రానికి రాకపోకలు సాగించే భక్తుల ప్రయాణ కష్టాలు తీరతాయి. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందరావు . పవన్ కళ్యాణ్ ని కలిసి వాడపల్లి ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరున్న వాడపల్లి ఏడు వారాల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రోజు రోజుకీ భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోందని, రావులపాలెం మీదుగా ఉన్న ప్రస్తుత రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ రద్దీతో భక్తులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. 216 జాతీయ రహదారి నుంచి ఏటిగట్టు మీదుగా 7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

పవన్ సానుకూలంగా స్పందించి తక్షణం నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డుని అభివృద్ధి చేస్తే భక్తులు గోదావరి తీరాన ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం చెప్పారు.

## బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగ మద్యపాన నివారణ చర్యల్లో భాగంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నిడమర్రు, పెదవడ్లపూడి, ఆత్మకూరు, ఎర్రబాలెం గ్రామాల్లో గురువారం బహిరంగంగా మద్యపానం చేస్తున్న 12 మందిని గ్రామీణ ఎస్ఐ బాలు నాయక్ అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. చట్ట విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయరాదని, అలాంటి చర్యలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సామాజిక శాంతి భద్రతకు సహకరించాలని, బహిరంగ మద్యపానాన్ని పూర్తిగా నిరోధించడంలో భాగస్వాములవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగులతో సమీక్షా సమావేశం



**ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బి. రామాంజనేయులు పార్టీ క్యాంప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలో గల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో భాగంగా ఎంఎల్ఏ రామాంజనేయులు మాట్లాడుతూ గతంలో తాను జిల్లా కలెక్టర్ గా మరియు రాష్ట్ర కమిషనర్ గా పనిచేసిన అనుభవం తో ఉద్యోగులు వారి విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ అభివృద్ధి వైపు తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్ద ఎత్తున జీవనోపాధి సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయి ఆర్థిక పరిస్థితే సాధన దిశగా పనిచేయాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ నీ అందిపుచ్చుకొని వారి జీవనోపాదులపై డి పి ఆర్ లు ఏర్పాటు చేసి దీన్ దయాళ్ జీవన జ్యోతి ఉపాధి కార్యక్రమం లో ఉన్న అన్ని జీవనోపాదుల కల్పన పై దృష్టి సారించి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో ఉన్న జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## తోకవారిపాలెం లో రచ్చబండ కార్యక్రమం



**ప్రత్తిపాడు నియోజకవర్గం, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు రూరల్ మండల పరిధిలోని తోకవారిపాలెం గ్రామంలో వైఎస్ఆర్సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ నేతృత్వంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా తొకవారిపాలెం గ్రామం లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రక్షాళన దిశగా సహకార వ్యవస్థ

- **రాష్ట్రవ్యాప్తంగా డిజిటలైజేషన్ దిశగా సహకార సంఘాలు**
- **డిజిటల్ విధానంలో వేగంగా సాగుతున్న ఆంధ్ర**
- **అన్ని వర్గాల రైతులకు ప్రయోజనం**
- **గ్రామీణ, సామాజిక, ఆర్థిక వ్యవస్థ బలోపేతం**




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ సహకార వ్యవస్థను సంస్కరణలతో బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సహకార రంగంలో విప్లాత్మకమైన మార్పులు తెచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా డిజిటలైజేషన్ కి శ్రీకారం చుట్టబోతోంది.

దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 63 వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీలను) రూ.2,523 కోట్లతో ఆధునికరించబోతోంది. ఇందుకోసం పక్కా ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. అందులో ప్రధానంగా డిజిటలీకరించడానికి తొలి ప్రాధాన్యత ఇస్తారు. గ్రామీణ సామాజిక, ఆర్థిక వ్యవస్థలో సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని, పారదర్శకతను, అర్హులకు రుణ సరఫరాను పెంచాలన్నదే దీని వెనక అసలు ఉద్దేశం గా సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే రాష్ట్రంలో దాదాపు 2 వేలకు పైగా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయి.

ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీలు) రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది రైతులకు ఏటా రూ.3 వేల కోట్ల రుణాలను అందిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వేగంగా, మరి కొన్ని చోట్ల మందకొడిగా పీఏసీల డిజిటలీకరణ జరగడంతో లబ్ధిదారులకు ఆశించిన ఫలాలు అందడం లేదు. ఏపీలో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా పరిశీలించినట్లయితే గుజరాత్‌లో డిజిటలీకరణ 63శాతాన్ని మించిపోతే, కర్ణాటకలో 18శాతం దగ్గరే తచ్చట్లాడుతోంది. ఇది చాలా తక్కువే. అందుకే రెండు రాష్ట్రాల్లో పీఏసీల ద్వారా రుణ సరఫరాలో తీవ్ర వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. పీఏసీల డిజిటలీకరణలో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. కర్ణాటకలో షెడ్యూల్డ్ కులాలు, తెగల రైతులకు రుణ నిరాకరణ 38శాతం కాగా, ఓబీసీలకు ఈ రేటు 12శాతమే. అగ్రకులాల్లో రుణాలు పొందలేకపోయినవారు ఎనిమిది శాతమే! ఇదిలా ఉండగా

ఈ ఏడాది జూన్ నాటికి దేశీయంగా 37శాతం పీఏసీల డిజిటలీకరణ మాత్రమే జరిగింది. ఈ విషయంలో గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లు అగ్ర స్థానంలో ఉంటే బిహార్, కర్ణాటకలు వెనకబడిపోయాయి. ఆంధ్ర ప్రదేశ్.లో సహకార సంస్థల ఆధునీకరణ చాలా వేగంగా సాగుతున్నట్లు తెలుస్తోంది

డిజిటలీకరణ గణనీయ స్థాయిలో ఉన్న రాష్ట్రాల్లోనూ ఆధిపత్య వర్గాలతో పోలిస్తే దళితులకు మూడు రెట్లు ఎక్కువగా రుణ నిరాకరణ జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. గ్రామీణ మహిళలు కూడా రుణ సరఫరాలో అసమానతలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు

గ్రామీణ మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, ఇతర లొసుగులు, సాధకబాధకాల వల్ల వారు డిజిటల్ ప్రక్రియపై పురుషులకన్నా నాలుగు రెట్లు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. మొబైల్ ఫోన్లు, ఆధునిక టెక్నాలజీ, బ్యాంకింగ్‌పై అవగాహన ఉన్నవారే డిజిటల్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొని ప్రయోజనం పొందగలుగుతున్నారు. మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ తదితర మౌలిక వసతులు సరిగ్గా అందకపోవడం పీఏసీల డిజిటలీకరణకు ఆటంకమవుతోంది. వివిధ ప్రాంతాల్లో విభిన్న వ్యావసాయిక పరిస్థితులు ఉంటాయి. ఒక్కో సీజనులో వేసే పంటల్లోనూ వ్యత్యాసం కనిపిస్తుంది. ఈ తేడాలన్నింటినీ ప్రామాణిక సాఫ్ట్‌వేర్ పూర్తిస్థాయిలో ప్రతిబింబించలేకపోవడం కూడా రుణ వితరణలో అసమానతలకు తావిస్తోంది. పీఏసీల పాలనా బోర్డుల్లో కొన్ని వర్గాల ఆధిపత్యం దళితులకు, మహిళలకూ నష్టదాయకంగా పరిణమిస్తోంది. ఉదాహరణకు కర్ణాటక పీఏసీ బోర్డుల్లో 52శాతం సభ్యులు ఆధిపత్య కులాలు ఉన్నట్లు గుర్తించారు.

ఇలాంటి అసమానతలు, వివక్షల గురించి సామాజిక, ఆర్థికవేత్తలు ముందే హెచ్చరించారు. ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్త పియెర్ బోర్ద్యూ ప్రతిపాదించిన ఫీల్డ్ థియరీ ప్రకారం డిజిటల్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్లు, డేటా సాంకేతికతల వినియోగాలపై పట్టు ఉన్న వర్గాలే అధికారం చలాయిస్తాయి, బలహీన వర్గాలు వెనకబడిపోతాయి. నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ ప్రతిపాదించిన క్యాపబిలిటీస్ సిద్ధాంతం ప్రకారం అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకునే సామర్థ్యం ఉండటమూ ముఖ్యం. మధ్యతరహా, పెద్ద రైతుల మాదిరిగా చిన్న సాగుదారులు, పేద మహిళలకు డిజిటల్ పరిజ్ఞానం అంతగా ఉండదు. అందుకని పీఏసీల రుణ వితరణ డిజిటలీకరణ చెందినా వారు పెద్దగా లబ్ధి పొందలేకపోతారు. రిజర్వు బ్యాంకు, నాబార్డ్, జిల్లా బ్యాంకులు, రాష్ట్రాల రిజిస్ట్రార్లు, జిల్లా సహకార బ్యాంకుల (డీసీసీబీల) మధ్య సమన్వయ లోపంతో సాఫ్ట్‌వేర్ అమలులో ఆలస్యాలు, పొరపాట్లు జరుగుతున్నాయి.

**ప్రజాస్వామ్య వికాసానికి...:** ప్రపంచంలో సహకారోద్యమం విజయవంతమైన జర్మనీ, జపాన్, కెన్యా దేశాల అనుభవాల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. జర్మనీ పారదర్శకత సాధనలో అగ్రగామి కాగా, సభ్యుల అభిప్రాయాలు, అవసరాలను బట్టి జపాన్, కెన్యాలు డిజిటలీకరణ చేపడుతున్నాయి. ఇలాంటి పద్ధతులను ఇండియాలోనూ అనుసరించాలి. జాతీయ స్థాయిలో పీఏసీల కోసం ప్రత్యేక డిజిటల్ ప్రాధికార సంస్థను ఏర్పరచాలి. రాష్ట్ర స్థాయిలో సహకార రిజిస్ట్రార్లకు మరింత మెరుగైన శిక్షణ, స్పష్టమైన అధికారాలు ఇవ్వాలి. జిల్లా స్థాయిలో శిక్షణ కేంద్రాలు, మద్దతు వ్యవస్థలను నెలకొల్పాలి. స్థానిక స్థాయిలో సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచడానికి అంబుడ్స్‌మన్‌ను నియమించాలి. గతకాలపుఅసమానతలు, వివక్షలకు కొత్త రూపు ఇవ్వకుండాజాగ్రత్తపడుతూ పారదర్శకతను, సభ్యుల చురుకైనభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే పీఏసీల డిజిటలీకరణ సరికొత్త ప్రజాస్వామ్య వికాసానికి దారితీస్తుంది. 2047 నాటికి వికసిత భారత్ సాధనకు తోడ్పడుతుందని అంచనా వేశారు.

# వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలోను, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం పర్యటించారు. ఉదయం నుండి వర్షాలు విస్తృతంగా కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పర్యటించారు. మూడు వంతెనలు వద్ద, బ్రాడిపేట నాలుగవ లైన్ మీదుగా పర్యటించి పట్టాభిపురం అండర్ వే బ్రిడ్జి (కంకర గుంట బ్రిడ్జి) ని పరిశీలించారు. విపత్తుల సమయంలో జన జీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎక్కువ వర్షాలు కురిసే సమయంలో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎక్కడా నీరు నిలువ లేకుండా చూడాలని అన్నారు. మురుగు నీటి వ్యవస్థను మరింత పక్కాగా చేపట్టాలని సూచించారు. అచ్చట నుండినంబూరు వద్ద బుడంపాడు కాలువను, గుంటూరు చానెల్, గుంటూరు నల్లాను పరిశీలించారు. గుంటూరు చానెల్, గుంటూరు నల్లా నుండి ప్రవాహం సక్రమంగా జరిగి, నంబూరు గ్రామానికి ఇబ్బంది లేకుండా ఉండటానికి అవసరమగు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ను ఆదేశించారు. నంబూరు వద్ద ఆక్రమణలు తొలగించుటకు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు.

కంతేరు రోడ్ అండర్ బ్రిడ్జి. ఎర్రవాగు, కంతేరు వాగు, కోటెళ్లవాగు లను ఆమె. పరిశీలించారు. ఎర్రవాగు, కంతేరు, కోటెళ్లవాగులకు గండి పడే అవకాశాలు ఉన్న ప్రదేశాలు గుర్తించి తగిన అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు.

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు నిత్యం చేపడుతున్న కార్యక్రమాలు, విపత్తుల సమయంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కాలువలలో ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగజేయకుండా 82 ప్రదేశాల్లో మెష్ లను ఏర్పాటు చేశామన్నారు.

జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం - బుడంపాడు కాలువ నీటి పారుదల వ్యవస్థను వివరించారు. ఎర్రవాగు, కంతేరు, కోటెళ్లవాగులకు ఆగస్టులో కురిసిన వర్షాలకు రహదారులపైన నీరు ప్రవహించిందన్నారు.

కంతేరు, కొప్పర, ఖాజా, కాకాని, జాతీయ రహదారిపై నుండి గుంటూరు చానెల్ కు నీటి ప్రవాహం వస్తుందని, దాని నుండి గుంటూరు నల్లాకు ప్రవాహం వస్తుందని నంబూరు గ్రామస్తులు తెలిపారు. సరైన కాలువ వ్యవస్థ లేక అధిక వర్షాలు పడే సమయంలో గ్రామం చుట్టూ నీరు వస్తుందని, దాదాపు ఆరు వార్డుల గ్రామస్తులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. గ్రామంలో కనీసం ఒక బ్రిడ్జిని ఎత్తుగా నిర్మించాల్సిన అవసరం ఉందని వివరించారు. కాలువలోకి నీటి ప్రవాహం వెళ్ళే మార్గంలో కొన్ని ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించి నంబూరి కాలువలోకి నీరు పారుటకు ఒక కిలో మీటరు మేర కాలువను నిర్మించాలని కోరారు. గ్రామం మధ్యలో ఉన్న గుంటూరు చానెల్ రెండు వైపుల గట్టులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జాతీయ రహదారి నుండి తాడికొండ రహదారిలో ఎక్కువ వర్షాలు కురిస్తే కంతేరు రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద దాదాపు 15 అడుగుల మేర నీరు నిలుస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఎర్రవాగు ప్రవాహం తీవ్రంగా ఉంటుందని, ఆగస్టులో కురిసిన వర్షాలకు నిలువెత్తు నీటితో రహదారి మునిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి రాంబాబు, పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 1 నుంచి ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయాలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని రాష్ట్ర ఉప ముఖమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు (డి.డి.ఓ.) కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో ఆయన. సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ విధానం రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకువచ్చామని చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిధులు సమకూర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో ఉందనీ... ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివృద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.

## అన్నే లక్ష్మీరాజ్యంకు ఘన నివాళులు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి హాస్పటల్ రోడ్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ అన్నే సూర్యజీరావు సతీమణి శ్రీమతి లక్ష్మీరాజ్యం బుధవారం సాయంత్రం కన్ను మూసిన సంగతి విదితమే. గురువారం శ్రీమతి లక్ష్మీరాజ్యం మృతదేహాన్ని ఆమె నివాసంలో వివిధ రంగాల ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పెదవడ్లపూడి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ఆలూరి ప్రసాద్, అట్లూరి జయ పుష్ప కుమార్, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, డాక్టర్ సీతారామరెడ్డి, అన్నే సాంబశివరావు, నిమ్మగడ్డ రమేష్, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, అన్నే నందకిషోర్, శేషారావు, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ఆలూరు విజయలక్ష్మి, రాయపాటి వెంకటేశ్వరరావు, శ్రద్ధాంజలి ఘటింరు.

## డిప్యూటీ సిఎంను కలిసిన వేగేశన



**బాపట్ల, (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం, జనసేనా పార్టీ అధ్యక్షులు కొణిదెల. పవన్ కళ్యాణ్ ను బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కలిశారు. వేగేశ న నరేంద్ర వర్మ రాజు కుమారుడు రాకేష్ వర్మ వివాహ మహోత్సవం ను పురస్కరించుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.

## వండువ ఇనాం భూముల రైతుల్ని అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చండి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఇనాం భూములు, డీకేటీ పట్టాలు ఉన్న రైతులకు కూడా అన్నదాతా సుఖీభవ వర్తింప చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి రైతుకీ సాయం అందాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, వండువ గ్రామ పరిధిలో ఇనాం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం వర్తించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. వండువ గ్రామ పరిధిలో 653 మంది రైతులు ఇనాం భూములు సాగు చేసుకుంటుండగా, వారికి అన్నదాతా సుఖీభవ సాయం అందలేదు. ఈ విషయాన్ని పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ గురువారం సాయంత్రం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంపై తక్షణం స్పందించిన పవన్ .. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ఘనంగా ఏ పి ఎస్ పి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీ ఎస్ పి ఎఫ్)ఆవిర్భావ దినోత్సవంను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు నందు డైరెక్టర్ జనరల్ డా. త్రివిక్రమ వర్మ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ బి.వి.రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఎస్ పి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఘనంగా ఉన్నదని, ఈ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహించినటువంటి డా. త్రివిక్రమ్ వర్మ డి జి మరియు ఇతర అధికారులను సిబ్బందిని ప్రసంశించారు. ఎస్ పి ఎఫ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం, రిక్రూట్మెంట్ కొరకు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 25 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్నటువంటి 2000 బ్యాచ్ కానిస్టేబుల్స్ ను అప్గ్రేడ్ చేయుటకు ప్రభుత్వ పరిశీలనలో ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ డా.త్రిక్రమ వర్మ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర విభజన తర్వాత ఎస్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకోవటం ఇది మొదటి సారి అని తెలిపారు. ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించరాని, ఎస్పీఎఫ్ సిబ్బంది అందరికీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఎస్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించినటువంటి క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి స్పెషల్ హోమ్ సెక్రెటరీ విజయ కుమార్ , ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రియాక్టర్ ఇన్- చార్జ్ వైస్ ఛాన్సిలర్ శివరాం ప్రసాద్ , కమాండెంట్ డి ఎన్ ఏ భాషా , అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్స్పెక్టర్లు, ఇతర ముఖ్య అధికారులు స్పాన్సర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మరిన్ని పెట్టుబడులు పెట్టండి



## దిగ్గజ సంస్థ ఒరికాకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

### ఆస్ట్రేలియాలో సిఇఒ, ఎండి సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజసంస్థ ఒరికా ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సిఈఓ, ఎండి సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో ఒరికా ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈసమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫ్యాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఒరికా సంస్థ సిఈఓ, ఎండి సంజీవ్ గాంధీ తెలిపారు. ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# రాష్ట్రంలో కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్లు

## వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో రైతుల సౌకర్యార్థం కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల సంఖ్య 207కి చేరుతుందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో ఇప్పటి వరకు 172 మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్లు చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,408 మంది పార్టీ కార్యకర్తలకు మార్కెట్ కమిటీలలో నామినేట్ పోస్టులు దక్కాయని వెల్లడించారు. మిగిలిన 35 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు త్వరలోనే నియామకాలు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని అన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ లలో పాలక వర్గాల నియామకం వల్ల మార్కెట్లలో పారదర్శకత పెరుగుతుందని, రైతులకు సకాలంలో సౌకర్యాలు అందుతాయని తెలిపారు.

# తెలంగాణ వచ్చాక మోసపోయింది దళితులే

## ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ వచ్చాక ఎవరైనా మోసపోయారంటే అది దళితులే అని ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియా మాట్లాడారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ఒక చేత్తో రాజయ్యకు ఇలా మంత్రి పదవి ఇచ్చి అలా మరో చేయితో లాక్కున్నారని అన్నారు. ఆ తర్వాత కడియంకు ఇచ్చి ఆయన్ను కూడా పక్కదోవ పట్టించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చాక 15 మంది ఉన్న కేబినెట్ లో ఐదుగురు దళితులకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అన్నారు. ఇందులో ఒక డిప్యూటీ సిఎం, స్పీకర్, హెల్త్ మినిస్టర్, మైన్స్ మినిస్టర్, సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ ఉన్నారు అన్నారు. అడ్లూరిపై మాట్లాడే స్థాయికి కిశోర్ రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అడ్లూరిపై మరోసారి మాట్లాడితే నాలుక చీరుతామన్నారు.

# రాష్ట్ర సాధన కోసం కోదండరాం నిస్వార్థ కృషి



## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిజెఎస్ మద్దతు కోరిన మహేష్‌కుమార్‌గౌడ్

### ఉద్యమకారులకు గుర్తింపునివ్వాలి: ప్రొ.కోదండరాం

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ ఆవిర్భావంలో కోదండరాం పాత్ర చరిత్రలో నిలిచిపోయేదని, నిస్వార్థంగా నిజాయితీగా రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు కోదండ రాంతో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భేటి అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి టిజెఎస్ మద్దతుపై చర్చించారు. ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలన ఎలా గాడి తప్పిందో ప్రజలకు తెలుసునన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ నిరంకుశ పాలన విముక్తి కోసం 2023లో మేమెంత కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారి సహకారం మరచిపోమని, ఉద్యోగ నియామక రూప కల్పనలో కోదండరాం సలహాలు సూచనలు విలువైనవని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజా పాలన సాగుతుందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో మద్దతు కోరినట్లు తెలిపారు. యువకుడైన నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. సిపిఐ, సిపిఎం, ఏంఐఎం పార్టీల మాదిరిగానే టిజెఎస్ మద్దతు కోరినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి బండి సంజయ్ ఏం మా ట్లాడుతున్నారో అర్థమవుతుందా? అంటూ ప్రశ్నిం చారు. కేంద్రమంత్రికి స్థాయి వ్యక్తి నోటికొచ్చింది మాట్లాడటం విచారకరం అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్ రాజేసి లబ్ధి పొందాలని బిజెపి నేతల పన్నాగం చేస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మిత్ర పక్షాల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. ఎన్నికల సమ యంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మిత్రపక్షంగా టిజెఎస్ పార్టీకి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పించాలని, రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పలుచోట్ల టిజెఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా బీసిరిజర్వేషన్ల సాధన కోసం తీవ్రంగా కృషి చేయాలని, ఆ ప్రయత్నానికి టిజెఎస్ పార్టీ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విషయంలో టిజెఎస్ రాష్ట్ర కమిటీసమావేశంలో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామని కోదండరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు,ప్రధాన కార్యదర్శులు గొప్పగాని శంకర్‌రావు, పల్లెవినయ్, నిజ్జన రమేష్ ముదిరాజ్,ఆశప్ప, నాయకులు మాసంపల్లి అరుణ్ కుమార్, సర్దార్‌జస్వంత్, బట్టల రామ చందర్, కొత్తరవి,ప్రశాంత్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

# ఐఎఎస్ రిజ్వీ విఆర్ఎస్‌కు ఆమోదం

## ముగ్గురికి అదనపు బాధ్యతలు

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణలో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ ఈ నెలాఖరు నుండి అమల్లోకి రానుంది. తనకు స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతి ఇవ్వాలని ఇటీవల రిజ్వీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం అందుకు అనుమతించింది. ఈ మేరకు దీనికి సంబంధించి బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తెలంగాణలో ముగ్గురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరోక ఉత్తర్వులు జారీ చేశారు. వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం.రఘునందన్ రావును రెవెన్యూ (వాణిజ్యపన్నులు, ఎక్సైజ్) శాఖ కార్యదర్శి పదవికి పూర్తి అదనపుఛార్జ్ (ఎఫ్ఎసి) ఇచ్చింది. తెలంగాణ జెన్కో సిఎండి. ఎస్ హరీష్ ను ఎండోమెంట్స్ డైరెక్టర్ బాధ్యలను అప్పగించింది. శైలజా రామయ్యర్ ను పూర్తి అదనపు ఛార్జ్ నుండితప్పించింది. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా ను గనులు, భూగర్భ శాస్త్ర డైరెక్టర్ పదవిలో పూర్తి అదనపు బాధ్యతలను కట్టబెట్టింది. ఈ అదనపు పూర్తి బాధ్యతలను ఇప్పటి వరకూ చూస్తున్న వల్లూరు క్రాంతిని దాని నుండి తప్పించింది. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను గరిమా అగర్వాల్‌కు కట్టబెట్టింది. గరిమా అగర్వాల్ ప్రస్తుతం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. గరిమా అగర్వాల్ ఇంతకు ముందు కరీంనగర్ జిల్లాఅదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా సేవలు అందించారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన గరీమా అగర్వాల్ యాదాద్రి భువనగిరి జిల్లా ట్రైనీకలెక్టర్‌గా రెండేళ్లు, కరీంనరగ్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా రెండేళ్లు పనిచేశారు.

# సంక్షేమ హాస్టళ్ల టెండర్లు రద్దు

**హైదరాబాద్,అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగ తులు, మైనార్టీ వర్గాలకు చెందిన గురుకులాలు, హాస్టళ్లలో టెండర్లను రద్దు చేస్తూ తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. సంక్షేమ గురుకులాలు, హాస్టళలో లక్షలాది మంది విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల సరఫరాకు సంబంధించిన టెండర్లను పునఃసమీక్షించనుంది. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, డ్రెస్సులు, స్కూల్ బ్యాగుల వంటి వ్యక్తిగత వస్తువులు అందించే కార్యక్రమం వాయిదా పడింది. గురుకుల విద్యార్థులకు యూనిఫాంలు, పీటీ డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ పెట్టెలు, బెడ్ మెటీరియల్, బూట్ల వంటి వ్యక్తిగత వస్తువుల సరఫరా కోసం కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) టెండర్ల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రారంభించింది. అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు కలిపి ఒకే టెండర్ విధానాన్ని (గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్ జెమ్) తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ టెండర్లు గత నెలలోనే ఖరారై, సరఫరా ఈనెల 1 నుంచి ప్రారం భం కావాల్సి ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం జరిగింది. ఫలితంగా ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావడంతో వివిధ వస్తువుల సరఫరా టెండర్లను పూర్తిగా నిలిపివేశారు. జెమ్‌లో చేసుకున్న దరఖాస్తులు కూడా రద్ద య్యాయి.మరోవైపు విద్యార్థుల డైట్ (పౌష్టికాహారం) కోసం సరకుల సేకరణ ప్రక్రియ విషయంలో ఇప్పటికే పెండింగ్‌పడింది. ఈ పౌష్టికాహారం సరఫరాకు సంబంధించిన టెండర్ల వ్యవహారం కూడా కోర్టు పరిధిలో ఉండడంతో దీనిపైకూడా సందిగ్ధత నెలకొంది. ఈ నిర్ణ యంతో ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు వస్తువుల సరఫరా ఉండే అవకాశాలు కనిపించడం లేదు.

# రికార్డు స్థాయిలో జల విద్యుత్

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** ఈ సీజన్‌లో రిజర్వాయర్లలోకి భారీ వరద నీరు వచ్చి చేరడంతో తెలంగాణలో జల విద్యుత్తు కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో జరుపుతున్నాయి. తెలంగాణ జెన్కో ఈ నెల 19న అర్ధరాత్రి నాటికి 5 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి జరగ్గా, ఆ రికార్డును ప్రస్తుత సంవత్సరంలో దాటే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఈ నెల 20 నాటికి జల, థర్మల్ విద్యుత్తు కలిపి 20 వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది. దీంతో సీజన్ ముగిసేనాటికి జలవిద్యుత్తు ఉత్పాదన కొత్త రికార్డులు సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు. కరెంటు యూనిట్ రూ.4 చొప్పున డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. విద్యుత్తును ఉత్పత్తి చేసి విక్రయించడంతో ఇప్పటి వరకూ తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం లభించింది. కాగా రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టుల వద్ద 2441.8 మెగావాట్ల సామర్థం కలిగిన జలవిద్యుత్ కేంద్రాలు ఉండగా, అందులో కృష్ణా నదిపై 2371.6 మెగావాట్ల కేంద్రాలు, గోదావరిపై 70.2 మెగావాట్ల కేంద్రాలున్నాయి.

# హంతకులకు మద్దతు తెలపడం సరికాదు

## విహెచ్‌పి రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), అక్టోబరు 23:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అత్యంత క్రూరంగా హత్య చేసిన సమయంలో స్పందించని మానవ హక్కులు,ఉగ్రవాదులకు తగురీతిలో జవాబు ఇచ్చినప్పుడు స్పందిచడం అత్యంత దారుణం అని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర ప్రచార ముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రవృత్తులకు మరింత ప్రోత్సాహం, లభించేలా మానవ హక్కులు మాట్లాడటం చూస్తుంటే హంతకులకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు అవుతుందని ఏద్దేవా చేశారు. పోలీసుల ప్రాణాలకు విలువలేదా,అని మానవహక్కులను ఆయన ప్రశ్నించారు. నిజామాబాద్ నగరంలో ప్రమోద్ అనే కానిస్టేబుల్‌ను అత్యంత ఘోరంగా హత్య చేసి,మరి కొంతమందిని చంపేందుకు ప్రయత్నం చేసిన రియాజ్‌ను ఎన్‌కౌంటర్ పోలీసుల పనితీరుకు నిదర్శనం అని ప్రశ్నించారు. ఈవిషయంలో తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి,నిజామాబాద్ కమిషనర్ సాయిచైతన్య పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు అమరవీరుల సంసర్మణ దినోత్సవం సందర్భంగా ఉగ్రవాది జాతికి సంబంధించిన రియాజ్ ఎన్‌కౌంటర్ పోలీసుల సమర్ధతకు సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని రాజ్యాంగాన్ని ఉల్లఘించే ఎంతటి జిహదీ మూకలకైనా ఇదే రీతిలో జవాబు ఇవ్వాలని పోలీసుయంత్రాంగానికి బాలస్వామి కోరారు. అంతే కాకుండా ప్రమోద్ కుటుంబాన్ని ఆదుకుని పోలీసు విభాగం బాసటగా నిలిచిందన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న పంటలు

## తడిసిన ధాన్యం, మొక్కజొన్న

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చేదికంది వచ్చిన పంటలు నీటి పాలవుతున్నాయి. రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయని, పెట్టుబడులు సైతం నష్టపోతున్నామని పలువురు కన్నీటి పర్యాంతమవుతున్నారు. రాష్ట్రంలోని సిద్దిపేట పట్టణంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి మార్కెట్‌లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలా రోజుల కిందటే మార్కెట్‌కు మొక్కజొన్నలు, ధాన్యం తెచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయిందని రైతులు వాపోయారు. తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాపారులు నామమాత్రంగా కొన్ని కుప్పలను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారని, మిగతా కుప్పలకు చాలా తక్కువ ధరలను నిర్ణయిస్తున్నారని, దీంతో నష్టపోతున్నామని అంటున్నారు. అలాగే దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట ఐకేపీ సెంటర్లో పలువురు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. వేకువజామున కురిసిన వర్షంతో ధాన్యం తడిసి నీటి పాలైంది. అలాగే ఖమ్మం జిల్లాలో వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. ఎకరాకు 50 వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. పత్తి తేమ ఉందని రూ.3,500 కే అడుగుతున్నారన్నారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున, రూ.8 లక్షల పెట్టుబడి పెట్టినట్లు బాధిత రైతులు తీవ్ర నిర్వేదంతో తెలిపాడు. ఇక ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలపాటు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. వారం రోజులు వర్షం కురువకపోవడంతో మక్క, సోయా, మినుము, పెసరు వంటి పంటలు చేతికి వచ్చాయి. ప్రస్తుతం పత్తి పంట చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో పత్తి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి

## ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బందిని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో విలీనం చేసి, వారి వేతనాలను హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కోరారు. ఈమేరకు సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది నిరంతరం సేవలందుతున్నారు. ఈ ఉపాధ్యాయులు రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులను తయారు చేస్తున్నారు. వారి సేవలను గుర్తించి, తగిన న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఇప్పటికే స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసి హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తున్న అంశాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నిర్ణయం ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పించడమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింతబలోపేతంచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# కెకెసి జాతీయ ఉపాధ్యక్షుడుగా నవాబ్ షేక్ ఇబ్రహీం



**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ (కంఘార్ కర్మచారి కాంగ్రెస్) జాతీయ ఉపాధ్యక్షులుగా తెలంగాణకు చెందిన నవాబు షేక్ ఇబ్రహీంను నియమిస్తూ ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నవాబ్ ఇబ్రహీం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్య వాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కౌశల్ సమీర్ పాల్గొన్నారు.



నిరుద్యోగుల సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య,చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

# 24న నిరుద్యోగుల సదస్సు

## 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని బిసి జెఎసి చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సదస్సుకు సంబందించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం బిసిభవన్‌లో జరిగింది. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ గత రెండేళ్లలో పలు నోటిపికేషన్లు కలిపి 60వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. మిగతా ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంకా అనేక ప్రభుత్వశాఖలలో పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 24న వేలాదిమందితో నిరుద్యోగుల సదస్సు జల విహార్‌లో జరుపాలని నిర్ణయించామని, ప్రభుత్వం జాబ్ క్యాలెండరు ప్రకటిస్తారని నిరుద్యోగులంతా ఎదురుచూస్తున్నారని తెలిన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి నిరుద్యోగులు కారణమని, వీరిని విస్మరిం చడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, అంజి, అనంతయ్య,రెడపాక రవి, కయ్య వెంకటేష్, శంకర్ నాయక్, బాలకోటి, రవికుమార్, సింధు రెడ్డి, రమాకాంత్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సదస్సుకు కెటిఆర్‌కు ఆహ్వానం

## శ్రీలంకలో జరిగే గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్‌లో కీలకోపన్యాసం

**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్(జిఈటిఎస్)- 2025 సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని ది కింగ్స్‌బరీ హోటల్‌లో జరగనుంది.శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరఫున, జిఈటిఎస్ శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.యు.ఎల్.ఎ. హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన పాత్రను కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం, అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.కేటీఆర్ పాల్గొనడం వల్ల దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని జిఈటిఎస్- 2025 సదస్సు కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక, ఆర్థిక వృద్ధిలో భారతదేశం - శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుండి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు, ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైన, సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని తెలిపారు.

# వచ్చేనెల 26న ఢిల్లీలో 'రాజ్యంగ హాక్కుల సాధన సభ': అద్దంకి దయాకర్




**హైదరాబాద్, అక్టోబరు 23(జర్నలిస్ట్‌ఫైల్):** వచ్చేనెల 26న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగినే "రాజ్యాంగ హక్కుల సాధన సభ"ను విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లా డుతూ ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు సాధిం చడంతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 26న నిర్వహించ తలపెట్టిన జంతర్ మంతర్ సభను విజయవంతం చేయాలని అద్దంకి పిలుపుని చ్చారు. 1990 అనంతరం ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోవడం రిజర్వేషన్ల పాత్ర తగ్గిందని అన్నారు. ఆనాటి నుంచి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రయోజనం లేకుండా పోయిందని ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ సాధిం చుకోవడంతో పాటు రాజ్యాంగాన్ని పరీక్షిం చుకునేందుకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.


# తిరుమలశెట్టి లక్ష్మి నాయుడు హత్యపై కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్

- సుజాత కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- గాయపడ్డ భార్గవ్‌కు 2 ఎకరాల భూమి కేటాయించి ఆదుకోవాలి



**విజయవాడ, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

కందుకూరు నియోజక వర్గం, గుడ్లూరు మండలం, దారకానిపాడు గ్రామంలో లక్ష్మి నాయుడు కుటుంబం పై జరిగిన హత్య కాండను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖండించడాన్ని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ స్వాగతించారు. బుధవారం విజయ వాడ, ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశం లో రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ లక్ష్మి నాయుడు కుటుంబాన్ని ఆదుకోవ డాన్ని స్వాగతిస్తూ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెూమంత్రి అనిత,మంత్రి నారాయణ, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ,డీజీపీతో సమావేశం నిర్వహించి లక్ష్మి నాయుడు హత్యపై సమీక్షించి సంఘటన పై నియమించిన కమిటీ నివేదిక పై ఆలోచన జరిపారు. అనంతరం లక్ష్మి నాయుడు సతీమణి సుజాతకి 2ఎకరాలు, 5లక్షల రూపాయలు, వారి కుమార్తెలకు 2 ఎకరాలు,5లక్షల డిపాజిట్, వారి చదువు ప్రభుత్వమే చేపట్టడం,లక్ష్మి నాయుడు సోదరులు పవన్ కు నాలుగు ఎకరాల భూమి, 5లక్షల నగదు, గాయపడ్డ భార్గవ్ కు,మూడు లక్షల రూపాయల నగదుతో పాటుగా వైద్య ఖర్చు ప్రభుత్వం మే భరిస్తుందని ప్రకటించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిడంతో మంగళవారం మీడియా సమావేశంలో మంత్రి అనిత,మంత్రి నారాయణ, శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ప్రకటించారు. భాదిత లక్ష్మి నాయుడు భార్య సుజాతకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని చందు జనార్ధన్ ముఖ్య మంత్రి చంద్రబాబుని హత్యకాండ లో గాయపడ్డ భార్గవ్ కి సహాయం చేసి రెండు ఎకరాల భూమిని ఇచ్చి సహా యం చేయ్యాలని కోరారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కి, టీడీపీ అధినేత మంత్రి నారా లోకేష్ కి, హెూమ్ మంత్రి వంగలపూడి అనిత కి, మంత్రి నారాయణకి, శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్ కి, ఇంటూరి నాగేశ్వరావు కి,రాజ్యసభ సభ్యులు సానా సతీష్ కి రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తూ ధన్యవాదములు తెలిపారు. రాష్ట్రంలో దారకాని పాడు గ్రామంలో బలిజ కుటుంబం పై దాడి జరిపి కుటుంబాన్ని హతమార్చే హత్యా కాండ కొనసాగిస్తే కాపు వర్గ కుటుంబానికి రాష్ట్ర కాపు జే ఏ సి మరియు ఇతర సంఘ నాయకులు మద్దతునిస్తే కులాలను అంటగట్టి విమర్శించడం శోచనీయమని చందు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల రెండవ తేదీన హత్యాకాండ కొనసాగితే రాష్ట్ర కాపు జే ఏ సి దృష్టికి గ్రామ నాయకత్వం 4వ తేదీన ఒంగోలు లో జరిగిన ప్రకాశం జిల్లా కాపు సంఘ సమావేశం లో జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సంజీవ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ నాయకత్వంలో సమీక్షించిన పిదప కొక్కిరాల సంజీవ కుమార్, కాపునాయకులు వెంకట రమణ కు అప్పచెప్పి పూర్వాపరాలు తెలుసు కొని గ్రామ పెద్దలు రాము, శివాజీ, మస్తానయ్య, హాజరత్తయ్య, శ్రీను నాయకత్వం,నియోజకవర్గం పెద్దలు వంశీకృష్ణ, రామమోహన్ ల సమన్వయం తో రాష్ట్ర కాపు జే ఏ సి బృందం చందు జనార్ధన్ నాయకత్వంలో దారకా నిపాడు గ్రామాన్ని మొదటిగా సందర్శించింది. గ్రామం లో పెద్దల సహకారంతో లక్ష్మి నాయుడు శ్రీమతి సుజాత తో సమావేశం అయి వేదింపుల పూర్వాపరాలు, బెదిరిం పులు, కుటుంబానికి ఉన్న ప్రాణ హాని, అంశాలను పూర్తిగా విని 5 డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని చందు జనార్ధన్ తెలిపారు. దారకాని పాడు గ్రామం లో జరిగిన దారుణాన్ని ఆ గ్రామంలో మీడియాతో,అదే రోజు వెంటనే కందుకూరు లో అనంతరం విజయవాడలో పలు దఫాలుగా మీడియా సమావేశాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాన్ని పంపామని జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ వివరించారు.లక్ష్మి నాయుడు శ్రీమతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,భార్గవ్ కు రెండెకరాల భూమి కేటాయించాలని కోరారు.లక్ష్మి నాయుడు హత్యను నిరసిస్తూ మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలకు నాయకులు తోట త్రిమూర్తులుకి,ఆమంచి కృష్ణమోహన్ కి,వంగవీటి నరేంద్ర కి,బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కి,బలిజ కాపు సంఘ నాయకులు ఆమంచి సోములు కి,ఏలూరి ప్రసాద్ కి దాసరిరాము కి, అమ్మశ్రీనివాస్ కి,రెడ్డి శేఖర్ రాయల్ కి ,యడం బాలాజీ కి,పోరుమామిళ్ల ఈశ్వర్ కి,చందు భావనారాయణ కి,పాకనాటి రమాదేవి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జే ఏ సి నాయకులు కొక్కి రాల సంజీవ కుమార్, భావనారాయణ,కొండేటి రాజేం ద్ర, యెన్ ఎస్ యు ఐ రాజు,మాసా బత్తుల శ్రీను వాస్, కేతినీడు భాస్కర్, ఐ లా విజయ్ కుమార్,సుంకర సాంబ శివరావు,జొన్నా రాజేష్,ఎర్రం శెట్టి అంజి బాబు, అల్లం రాజేష్, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్, అందరికీ ఇళ్లు అంశాలపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి బుధవారం నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఇళక్కియతో కలసి ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... పిజిఆర్ఎస్ అర్జీలలో అపరిష్కృతం గా ఉన్నవాటి వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కార విషయంలో అలసత్వం చూపరాదని, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కీలక ప్రగతి సూచికల్లో (కె పి ఐ) ఐసిడిఎస్, పోలీస్ శాఖల అంశాలలో పురోగతి ఉండాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మీ నరసింహం, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏ.పోసి బాబు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమారి, గ్రామ,వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, డి ఎస్ ఎల్ ఓ వై.మోహన్ రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 26న ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి విజ్ఞప్తి



**పెడన, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న అన్నారు. కొల్లూరి పర్యవేక్షణలో 28వ ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని బంటుమిల్లి రోడ్డు లోని స్థానిక చిట్టూరి మాధవరావు తోటలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య దంపతులచే శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు మధ్యాహ్నం 12 గంటల నుండి ఆర్యవైశ్య అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభమవుతుందని డా. కొల్లూరి తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్యకారిణి సబ్బిశెట్టి లహరి భగవద్గీత గోల్డ్ మెడలిస్ట్ చిట్టూరి ధరణి సారథ్యంలో బాల బాలికలకు పలు ఆటలు పాటలు కర్ర సాము పోటీల నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వబడును అని డా. కొల్లూరి తెలియజేశారు. పెడన పట్టణ మండల పరిసర ప్రాంత ఆర్యవైశ్య సోదర సోదరీమణులందరూ పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించి శ్రీ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కొల్లూరి విజ్ఞప్తి చేశారు.

## నిస్సహాయ కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ

### జనసేన నాయకులు పేట బ్రదర్స్ మిత్ర బృందం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం శివనాదపాలెం పంచాయతీలోని హరిజనవాడకు సంబంధించినటువంటి గురవయ్య అనే కుటుంబం తనకు గొంతు క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నానని, అంతేకాకుండా ఈ వర్షాల కారణంగా పరిస్థితి సరిగా లేదని , హాస్పిటల్ కి వెళ్లి టాబ్లెట్లు కూడా తీసుకోలేని పరిస్థితిలో ఉన్నామని, జనసేన నాయకులు మనీ కి తెలపడం జరిగింది, వెంటనే స్పందించిన మనీ టాబ్లెట్లకు కొంత నగదు ఏర్పాటు చేయడం జరిగింది, అంతేకాకుండా జనసేన నాయకులు పేట బ్రదర్స్ మిత్ర బృందం కలిసి బుధవారం స్వయంగా వాళ్ళ ఇంటికి వెళ్లి ఒక నెలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది, ఆ కుటుంబ సభ్యులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, దినేష్, ముని చంద్ర, సాయి, గోపి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఈ నెల 23 నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన

- తొలిరోజు పెనుగంచిప్రోలు మండలంలో పర్యటించనున్న కేంద్ర జల సంఘం డైరెక్టర్ ఎన్.అశోక్‌బాబు
- 24న ఇబ్రహీంపట్నం మండలంలో క్షేత్రస్థాయి సందర్శనలు

**విజయవాడ, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**



జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించి.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభారీ అధికారి & నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 23వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు ముండ్లపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటిం చనుండగా.. 24వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం, కేతనకొండ, కొండపల్లి, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసా యం, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కీలక సామాజిక, ఆర్థిక సూచికల్లో పురోగతిపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతోనూ ప్రభారీ అధికారి అశోక్‌బాబు మమేకమవుతారు.

## పంచారామాలకు ప్రత్యేక బస్సులు

**విజయవాడ, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

కార్తీక మాసం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పంచారామాల టూర్ ప్యాకేజీలో భాగంగా అమరలింగేశ్వర స్వామి- అమరావతి, సోమేశ్వర స్వామి- భీమవరం, క్షీరారామ లింగేశ్వర స్వామి- పాలకొల్లు, భీమేశ్వర స్వామి- ద్రాక్షారామం, కుమార రామ స్వామి, -సామర్లకోట పంచారామ క్షేత్రాలు ఉన్నాయన్నారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టూరిజం కేంద్ర రిజర్వేషన్ కార్యాలయం నుండి ఈ నెల 27, నవంబర్ 03,10,17 సోమవారం తేదీల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. పెద్దలకు: రూ.2130/, పిల్లలు: రూ.1760 లు ధర ఉంటుందన్నారు. వీటితోపాటు ప్రతి శనివారం విజయవాడ నుండి వాడపల్లి వరకు ప్రత్యేక బస్ ను పర్యాటక శాఖ నిర్వహిస్తోందన్నారు.. బుకింగ్‌ల కోసం www.tourism.ap.gov.in, ఇతర వివరాలకు 98480 07025, 84990 54422 & 1800 42545454 పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య ఆ ప్రకటనలో తెలియజేశారు.

# జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్

- ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలి
- 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు
- కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకలు అన్నుమన్ ప్రసాద్ దాస్



**విజయవాడ, అక్టోబర్ 23(జర్నలిస్ట్‌ఫైల్):**

జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్ ఏ 150 లో భాగంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రచార యాత్ర ప్రారంభించటం గర్వంగా ఉందని కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్ తెలిపారు.

నగరంలోని స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాసు మాట్లాడుతూ భారత చరిత్ర లో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచారయాత్ర నిర్వహించడం జరగుతుందన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాలు, జిల్లాలలో సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా (భారత ఉక్కు మనిషి) గా భారతీయ ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆయన చేసిన త్యాగాలను మరువలేమన్నారు. ఈనెల ఆరవ తేదీన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డా. మన్సుఖ్ మాండవియా దేశవ్యాప్తంగా సర్దార్ ఏ 150 యంగ్ లీడర్స్ ప్రోగ్రాం క్విజ్ లలో భాగంగా డిజిటల్ దశను ప్రారంభించారన్నారు. దేశవ్యాప్తంగా యువత సోషల్ మీడియా రీల్ కాంపిటేషన్లు, వ్యాస రచన పోటీలు, క్విజ్ పోటీలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎంతో మంది ప్రముఖ నేతలున్నా మనకు నేతాజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి నాయకులే మనకు గుర్తుకువస్తారన్నారు.

### దేశవ్యాప్తంగా అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఉపసంచాలకలు ఎస్వీడీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిధ్యాలను ప్రతిబింబించే విధంగా పట్టణాలు, గ్రామాలలో ఈ నెల 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యోగా, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచారయాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన నిర్వహిస్తామని, స్వచ్ఛత డ్రైవ్ లు, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ , ఎన్ఎస్ఎస్ యువత చురుకుగా పాల్గొంటారన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పార్లమెంటు సభ్యులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, వృద్ధులు, రిటైర్డ్ అధికారులు, క్రీడాకారులు వెటరన్స్, యువత ఈ ప్రచార యాత్రలో పెద్దఎత్తున పాల్గొంటారన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ప్రతి జిల్లాలో 8 కి.మీ నుంచి 10 కిలీమీటర్లు వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. మై భారత్ పోర్టల్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సర్దార్ ఏ 150 ఐక్యతా మార్చ్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మై భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో యు. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ వీరులకు

# 'శౌర్య' పురస్కారాలు!




**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** దేశ రక్షణలో అసాధారణ ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు అందించిన భారత సైనిక దళాల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పురస్కారాలను ప్రకటించింది. ఇటీవల విజయవంతంగా ముగిసిన 'ఆపరేషన్ సిందూర్' సహా పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్న ఆర్మీ, వైమానిక దళాలకు చెందిన పలువురు అధికారులను ప్రతిష్ఠాత్మక 'వీర చక్ర' పురస్కారంతో గౌరవించింది. ఈ మేరకు కేంద్రం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ ఆపరేషన్లలో భాగంగా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన 1988 (ఇండిపెండెంట్) మీడియం బ్యాటరీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిస్త్‌కు వీర చక్ర లభించింది. అలాగే, అత్యంత రహస్యంగా, తక్కువ సమయంలోనే ప్రత్యేక పరికరాలను విమానాల ద్వారా సమర్థంగా తరలించి, సైనిక సామర్థ్యాన్ని చాటిన 302 మీడియం రెజిమెంట్‌కు చెందిన కల్నల్ కోశాంక్ లాంబాను కూడా ఈ పురస్కారం వరించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నుంచి పలువురు అధికారులు వీర చక్రకు ఎంపికయ్యారు. శత్రువుల కట్టుదిట్టమైన గగనతలంలోకి చొచ్చుకెళ్లి, నిర్దేశిత లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించినందుకు ఫైటర్ పైలట్ గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిద్ధూకు ఈ గౌరవం దక్కింది.

ఫార్వర్డ్ ఎయిర్‌బేస్‌లో సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎస్ఏఎం) స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించి, మన వనరులకు ఎలాంటి నష్టం జరగకుండా శత్రువులకు భారీ నష్టం కలిగించిన గ్రూప్ కెప్టెన్ అనిమేశ్ పట్నీ కూడా వీర చక్ర అందుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన మిషన్‌లో భాగంగా, అర్ధరాత్రి వేళ శత్రు భూభాగంలోకి ప్రవేశించి కోటలాంటి లక్ష్యాలను ధ్వంసం చేసిన స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్, సంక్లిష్టమైన వైమానిక దాడిలో అద్భుతమైన సమన్వయం ప్రదర్శించిన స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్‌లకు కూడా వీర చక్ర పురస్కారాలు ప్రకటించారు. మొత్తంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 127 గ్యాలంట్రీ అవార్డులు, 40 విశిష్ట సేవా పురస్కారాలకు ఆమోదం తెలిపారు. వీటిలో 4 కీర్తి చక్రలు, 15 వీర చక్రలు, 16 శౌర్య చక్రలు ఉన్నాయి.



# ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

- ఆ దిశగా ప్రయత్నాలు సాగాలి
- ట్రంప్‌తో ప్రధాని మోడీ ఆకాంక్ష
- ఫోన్‌లో దీపావళి శుభాకాంక్షలు చెప్పిన ట్రంప్
- వైట్ హౌస్‌లోను దీపావళి వేడుకలు
- వాణిజ్య ఒప్పందం వేళ ఆసక్తికర పరిణామం
- సుంకాలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలని, ఈ దిశగా ఉమ్మడి ప్రయత్నాలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు చెప్పినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు అంటూ మోడీ ట్వీట్ చేశారు. "దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు. ఈ దీపావళి పండుగ నాడు రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచాన్ని ఆశతో ప్రకాశింపజేయడం కొనసాగించాలి. అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐకనయంగా నిలబడాలని కోరుకుంటున్నా" అని మోడీ ఆ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామంగా అందించడంలో పేరుగాంచిన పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు ప్రాముఖ్యత సంతరించుకుంది. మంగళవారంనాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోడీకి ఫోన్ చేసిన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. వైట్‌హౌస్‌లో ప్రత్యేక దీపావళి కార్యక్రమంలో ట్రంప్ దీపం వెలిగించి, ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం తాను భారత ప్రధానితో ఫోన్‌లో మాట్లాడానని చెబుతూ, మోడీ గొప్ప స్నేహితుడు అని ప్రశంసించారు. తమ ఇద్దరి మధ్య చాలా మంచి సంబంధం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇకపై ఆయన రష్యా నుంచి పెద్దగా ఆయిల్ కొనుగోలు చేయబోరని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలని నేను ఎంతగా కోరుకుంటున్నానో.. మోడీ కూడా అంతే కోరుకుంటున్నారని అన్నారు. వారు మరీ ఎక్కువగా చమురు కొనడం మానేస్తారు.. రష్యా కూడా యుద్ధం ఆపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే భారత్ భారీగా చమురు కొనుగోళ్లను తగ్గించిందని.. ముమ్ముందు మరింతగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో నిర్వహించిన దీపావళి వేడుకలలో అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఎఫ్‌బిఐ చీఫ్ కాష్ పటేల్, ఇంటెలిజెన్స్ హెడ్ తులసి గబ్బర్డ్, భారత్‌లో కొత్త అమెరికా రాయబారి సెర్గియో గోర్, భారతీయ అమెరికన్ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించనప్పటికీ.. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ట్రంప్‌కు ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో కూడా ట్రంప్ ఇలాంటి కామెంట్లే చేయగా.. న్యూఢిల్లీ ఆ వ్యాఖ్యలను గట్టిగా తిరస్కరించింది. "భారత్ ఆయిల్, గ్యాస్ ముఖ్యమైన దిగుమతిదారు. అస్థిరంగా ఉన్న ఇంధన పరిస్థితులలో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం మా స్థిరమైన ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ద్వారానే నిర్దేశించబడతాయి" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. తమ ఇంధన విధానాలు కేవలం దేశ అవసరాలు, వినియోగదారుల ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది.

సుంకాలు తగ్గే అవకాశం: దీపావళి శుభాకాంక్షలు చెప్పడానికే ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసినా, వారిద్దరి మధ్య ఎక్కువగా వాణిజ్యంపైనే చర్చ జరిగినట్లుగా సమాచారం. ఈ మేరకు రాయిటర్స్ పేర్కొంది.

తాజా ఫోన్ కాల్ సంభాషణ ప్రకారం రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం జరగవచ్చని, దీంతో అమెరికా సుంకాలు 16శాతం వరకు తగ్గించవచ్చని రాయిటర్స్ ఆ కథనంలో పేర్కొంది. త్వరలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధాలు కొనసాగిస్తుననందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భారత్‌పై 50శాతం సుంకం అమలవుతోంది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ - అమెరికా బంధం బలపడుతున్నట్లుగా కథనాలు పేర్కొంటున్నాయి. ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం జరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.

# మానాన్న చివరి అంకంలో ఉన్నారు..

## సతీశ్‌జర్కిహోళి పెద్ద బాధ్యతలకు అన్ని విధాలా అర్హుడు

## సిఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు

**బెంగళూరు, అక్టోబరు 23:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ భవిష్యత్తుపై ఆయన కుమారుడే చేసిన వ్యాఖ్యలు ఇపుడు కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. తనయుడు యతీంద్ర తన తండ్రిపై చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. తన తండ్రి రాజకీయ జీవితం చివరిదశలో ఉందని కర్ణాటకలో రాజకీయ నాయకత్వం చేపట్టేందుక సతీశ్ జర్కిహోళి అన్నివిధాలా అర్హుడని ఆయన అన్నారు. యతీంద్ర వ్యాఖ్యలు కర్ణాటకలో నాయకత్వ మార్పు అనివార్యం అని స్పష్టంచేస్తున్నాయని కాంగ్రెస్ వర్గాల్లోనే వినిపిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి తనయుడే ఈ వ్యాఖ్యలుచేయడంతో వీటికి మరింత ప్రాధాన్యం పెరిగింది. బెళగావిజిల్లాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో యతీంద్ర ఈ వ్యాఖ్యలుచేసారు. రాజకీయాల్లో తన తండ్రి చివరిదశలో ఉన్నారని, ఈ సమయంలో బలమైన ప్రగతిశీల భావజాలం కలిగిన నాయకుడు ఆయనకు అవసరమని అన్నారు. అలాంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శకునిగా ఉంటారని అన్నారు. సతీశ్‌జర్కిహోళికి ఆ లక్షణాలు న్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు ఆయనే సరైన వ్యక్తి అన్నారు. ఈ గురుతరబాధ్యతలు స్వీకరించేందుకు ఆయన సంసిద్ధులు కావాలని అన్నారు. పెద్ద బాధ్యతలు అంటే సీఎం మార్పునే సూచిస్తున్నా యని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సీఎం మార్పుఅంశంపై సిఎం సిద్ధరామయ్య, డికెశివకుమార్‌మధ్య ఇప్పటికే పరోక్షంగా వాగ్వాదాలు జరుగుతున్నాయి.



ఈ సమంలో సతీశ్‌పేరు తెరపైకి రావడం గమనార్హం. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రచారంలో ఉంది. పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆవిధానంపైనే నమ్మకంతో ఉన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రినని ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య చెపుతున్నా తన చేతుల్లో ఏమీలేదని డికెశివకుమార్ చెపుతున్నా ఇప్పటికీ ఊహాగానాలు చెలరేగుతూనే ఉన్నాయి. అయితే సిద్ధరామయ్యను దించితే కర్ణాటకలో పార్టీ రెండుగా చీలిపోతుందని హైకమాండ్ భయపడుతోంది. ఇపుడు హైకమాండ్ నిర్ణయం ఏమిటన్నదే కర్ణాటక కాంగ్రెస్ మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

# శ్వేతసౌధంలో సువిశాలమైన 'బాల్‌రూమ్'

## 999 అడుగుల విస్తీర్ణంలో రూ. 2200 కోట్లతో నిర్మాణం

**వాషింగ్టన్, అక్టోబరు 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల స్వప్నంగా భావిస్తున్న ప్రాజెక్టును పట్టాలెక్కించారు. శ్వేతసౌధం ప్రాంగణంలో అత్యంత సువిశాలమైన, ఆధునికమైన బాల్‌రూమ్ (నృత్యశాల) నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. వైట్‌హౌస్ తూర్పు విభాగంలో ఈ నిర్మాణం కోసం సోమవారం కూల్చివేతలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగంలో అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నానని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. గత 150 ఏళ్లుగా ప్రతి అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం ఒక పెద్ద బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారని, ఎట్టకేలకు ఆ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభమైందని ఆయన వివరించారు. ఈ ఏడాది జూలైలో ఈ ప్రాజెక్టు గురించి ట్రంప్ మొదటిసారి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ నిర్మాణానికి సంబంధించిన ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుంచి కాకుండా పూర్తిగా దాతలు అందించే విరాళాలతో భరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల అమెరికా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ఆయన పేర్కొన్నారు.

## మసూద్ సోదరి నాయకత్వంలో

# మహిళా జైషే!



**ముజఫరాబాద్, అక్టోబరు 23:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ తుఫత్ అల్ ముమినాత్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాస్‌లు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు 40 నిమిషాల పాటు మసూద్ సోదరీమణులు, కమాండర్ల కుటుంబ సభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి విరాళాలు కూడా సేకరిస్తున్నారు.

# శారీరకసంబంధం పదంతో లైంగికదాడిని నిర్ధారించలేం!

## పోక్సో కేసు కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన శారీరక సంబంధం అనే పదం చాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగిక దాడి జరిగిందని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ అలియాస్ భూపిందర్ వర్మ అనే వ్యక్తి తన 16 ఏళ్ల కజిన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిస్సందేహంగా నిరూపించడంలో విఫలమైందని అభిప్రాయపడింది. కేవలం శారీరక సంబంధం అనే పదాన్ని ఉపయోగించడం వల్ల, దానికి సరైన ఆధారాలు లేనప్పుడు, నేరం జరిగినట్లుగా భావించలేమని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లో గానీ, పోక్సో చట్టంలో గానీ ఈ పదానికి నిర్దిష్ట నిర్వచనం లేదని గుర్తుచేసింది. బాధితురాలు శారీరక సంబంధం అని చెప్పినప్పుడు, దాని అర్థం ఏమిటో, అది లైంగిక దాడి కిందకు వస్తుందో లేదో ప్రాసిక్యూషన్ గానీ, ట్రయల్ కోర్టు గానీ స్పష్టత కోరలేదని హైకోర్టు తప్పుబట్టింది. సాక్షుల నుంచి సరైన వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 165ను ఉటంకించింది. ఈ కేసులో ఘటన జరిగిన దాదాపు ఏడాదిన్నర తర్వాత మార్చి 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపైనా హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు విషం తాగిందని, ఆ తర్వాత ఆమెకు మాట పడిపోయిందని, తిరిగి మాట వచ్చిన తర్వాత ఫిర్యాదు చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, ఈ వాదనను బలపరిచే ఎలాంటి వైద్యపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఇంత సుదీర్ఘ జాప్యానికి సరైన కారణాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇది ఒక దురదృష్టకరమైన కేసుఅని వ్యాఖ్యానిస్తూ, ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసింది. నిందితుడిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



# ఎల్వోసి వెంబడి మళ్లీ చురుకుగా ఉగ్రశిబిరాలు!

## హోంశాఖకు నిఘా వేగుల నివేదిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తునాతునకలయిన ఉగ్రవాద స్థావరాలు మళ్లీ జీవంపోసుకుంటున్నాయి. వాస్తవాధీనరేఖ వెంబడి మళ్లీ ఉగ్ర లాంచ్‌ప్యాడ్‌లు, ఉగ్రశిక్షణ శిబిరాలు ప్రారంభం అయినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని భారత సరిహద్దుప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నట్లు తేలింది. చిన్నచిన్న క్లాసులు రూపంలో వీటినినిర్వహిస్తున్నారు. అయితే సాంకేతికతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. తద్వారా ఈ శిక్షణా శిబిరాలు డ్రోన్ నిఘాలను, వైమానిక దాడులను సైతం తప్పించుకునేదిశగా ఈ శిబిరాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖకు అందిన నిఘా నివేదికల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులకు సరిహద్దుల్లో శిక్షణ జరుగు తోందని, ఎంతమేర ఈశిబిరాలు విధ్వంసం చేసినా మళ్లీ పురుడు పోసుకుంటున్నాయని తెలిపింది. దీనితో ఇపుడు హోంశాఖ అన్ని దళాలను అప్రమత్తంచేసి వ్యూహాత్మక కసరత్తును సిద్ధంచేసుకోవాలని సూచించింది. సరిహద్దుల్లో ఇప్పటికీ ఉగ్రముప్పు దాగి ఉన్నందున మరింత నిఘాను పెంచుకోవాలనిసూచించింది. లూని, పుత్వాల్, టిపు పోస్ట్, జామిల్‌పోస్ట్, ఉమ్రాన్ వాలి, చాప్రార్ ఫార్వార్డ్, ఛోటా చక్, జంగ్లోరా ప్రాంతాల్లో ఉగ్రశిబిరాలు మళ్లీ చురుకుగా పనిచేస్తున్నాయని నిఘా వర్గాలు హోంశాఖకు నివేదిక ఇచ్చాయి. భద్రతా దళాలు వీటిని నిర్మూలించడానికిసైతం వీలులేని విధానంలో శిక్షణ ఇవ్వడం అక్కడి నుంచి కనుమరుగవడంచేస్తున్నాయని తేలింది.

## సంక్షిప్తంగా..

### రష్యా దాడుల్లో చిన్నారులు సహా ఏడుగురు మృతి : జెలెన్‌స్కీ



**కీవ్, అక్టోబర్ 23:** రష్యా తాజాగా చేపట్టిన డ్రోన్, మిస్సైల్ దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని రెండవ పెద్ద నగరమైన ఖార్కివ్‌లో ఉన్న కిండర్‌గార్డెన్‌పై అటాక్ జరిగింది. వరుస దాడుల వల్ల కీవ్‌లో కూడా నష్టం జరిగింది. చిన్నారులతో కలిపి సుమారు 26 మంది గాయపడినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే బుడాపెస్ట్‌లో పుతిన్‌తో జరగాల్సిన భేటీని డొనాల్డ్ ట్రంప్ రద్దు చేసుకున్నారు. ట్రంప్, యూరోప్ నేతలు పిలుపు ఇచ్చినా ఫ్రంట్‌లైన్ వద్ద కాల్పులు ఆగడం లేదని రష్యా పేర్కొన్నది. బ్రియాన్‌స్క్ బోర్డర్ ప్రాంతంలో ఉన్న రష్యా రసాయనిక ప్లాంట్‌పై ఉక్రెయిన్ మిలిటరీ అటాక్ చేసింది. బ్రిటన్ పంపిన స్టార్మ్ షాడో మిస్సైల్‌తో ఉక్రెయిన్ ఆ దాడిలో పాల్గొన్నది. రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఛేదించి ఆ స్టార్మ్ షాడో క్షిపణులు విజయవంతంగా దూసుకెళ్లినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

### వైట్‌హౌస్ భద్రతా గేటును ఢీకొట్టిన కారు



**వాషింగ్టన్, అక్టోబరు 23:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద మంగళవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. ఓ వ్యక్తి తన కారుతో నేరుగా వచ్చి భద్రతా గేటును ఢీకొట్టాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భవనం లోపలే ఉన్నారని, దీంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారని యూఎస్ సీక్రెట్ సర్వీస్ వెల్లడించింది. వాషింగ్టన్‌లోని 17వ ఈ స్ట్రీట్స్ కూడలి సమీపంలో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఓ కారు వేగంగా దూసుకొచ్చి వైట్‌హౌస్ ఆవరణలోని సెక్యూరిటీ గేటును ఢీకొట్టింది. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ యూనిఫాం విభాగం అధికారులు ఆ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో వైట్‌హౌస్‌కు ఎలాంటి లాక్‌డౌన్ విధించలేదని అధికారులు స్పష్టం చేశారు. కారును క్షుణ్ణంగా తనిఖీ చేసారు.

### శ్రీలంకలో కౌన్సిల్ ఛైర్మన్ కాల్చివేత!



**కొలంబో, అక్టోబర్ 23:** శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు.

తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని, దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

# తమిళనాడులో భారీ వర్షాలు

## లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు



**చెన్నై, అక్టోబరు 23:** తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.



# సెర్బియా పార్లమెంట్‌పై ఉగ్రదాడి

- కాల్పులు.. టెంట్ దగ్ధం
- ఓ అనుమానితుడు అరెస్టు

**బెల్‌గ్రేడ్ (సెర్బియా), అక్టోబరు 23:** సెర్బియా పార్లమెంట్ వద్ద కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పులో ఒకరు గాయపడ్డారు. అలాగే అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ మద్దతుదారులకు చెందిన టెంట్‌కు నిప్పు పెట్టారు. భద్రతా అధికారుల సమాచారం ప్రకారం, పార్లమెంట్ వెలుపల కాల్పులు చోటుచేసుకున్నాయని, అదే సమయంలో టెంట్ అగ్నికీలలో దగ్ధమైంది. కాల్పుల్లో 57ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన సాయుధ భద్రతా దళం ఘటనా స్థలంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. దాడికి ఎవరు పాల్పడ్డారన్నది తెలియడం లేదు. ఘటనను ఉగ్రవాదచర్యగా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ అభివర్ణించారు.

# కన్నతల్లిని హత్యచేసిన కసాయి

**చండీగఢ్, అక్టోబరు 23:** దేశమంతా దీపావళి సంబరాల్లో మునిగివున్న వేళ చండీగఢ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తన తల్లిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం సెక్టార్ 40లో నివసిస్తున్న 60 ఏళ్ల సుశీల అనే మహిళను ఆమె కొడుకు రవీందర్ నేగి అలియాస్ రవి (40) కత్తితో పొడిచి చంపాడు. దీపావళి రోజు ఉదయం 7 గంటల సమయంలో సుశీల ఇంట్లో నుంచి గట్టిగా కేకలు వినిపించాయని పొరుగున ఉంటున్న ఆకాశ్ బెయిన్స్ పోలీసులకు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికి ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. వారు టెర్రస్ పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి చూడగా, రవి చేతిలో కత్తితో పారిపోవడం కనిపించింది. లోపల సుశీల రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

# నరసరావుపేటలో 217 టిడ్కో గృహాల స్వాధీనం

**ప్రతి కుటుంబానికి. సొంత ఇల్లు**

**పండుగలాగా టిడ్కో గృహాల పంపిణీ**

**అభివృద్ధిలో పరుగులు పెడుతున్న నరసరావుపేట**

**ఎమ్మెల్యే అరవింద బాబు వెల్లడి**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నరసరావుపేట మున్సిపల్ పరిధిలోని 217 టిట్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనం చేసే కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంలో తన నిబద్ధతను ప్రదర్శించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, ఉమ్మడి కూటమి నేతలు, కార్యకర్తలు, మరియు లబ్ధిదారులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం టిట్కో గృహాల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి, లబ్ధిదారుల పేర్లను మార్చడం వంటి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. "ఉమ్మడి కూటమి ప్రభుత్వం గడిచిన 16 నెలల్లో టిట్కో గృహ సముదాయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. సీసీ రోడ్లు, సబ్‌స్టేషన్, డ్రైనేజీ, మరియు పరిశుభ్రత వంటి సౌకర్యాలను కల్పించాము. గతంలో అసాంఘిక శక్తులకు నిలయంగా ఉన్న ఈ గృహాలను నివాసయోగ్యంగా మార్చాము," అని ఆయన తెలిపారు.

నవంబర్ 2025లో మిగిలిన గృహాలను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని, కోర్టు కేసుల్లో ఉన్న 270 గృహాల విషయంలో కూడా త్వరలోనే పరిష్కారం చూపి వాటిని స్వాధీనం చేస్తామని హామీ ఇచ్చారు. "ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధిలో విజన్ 2047:** రాష్ట్రంలో సాంకేతిక మరియు పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలను హైలైట్ చేశారు. "విజన్ 2047లో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాము అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు . విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు దీనికి ఒక ఉదాహరణ," అని ఆయన తెలిపారు. అలాగే, సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నామని, నరసరావుపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన వివరించారు.

**జేఎన్టీయూ కళాశాల అభివృద్ధి:** నరసరావుపేటలోని జేఎన్టీయూ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలతో సహా కళాశాలను సమగ్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. "మా లక్ష్యం నియోజకవర్గ ప్రజలకు అన్ని రంగాల్లో అభివృద్ధిని అందించడం," అని ఆయన పునరుద్ఘాటించారు.

**జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా ప్రశంస :** పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కృషి ఫలితంగానే టిట్కో గృహాల స్వాధీన కార్యక్రమం విజయవంతమైందని కొనియాడారు. "ప్రతి కుటుంబానికి సొంతిల్లు అనే ఆకాంక్షతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు లబ్ధిదారులకు గొప్ప వరంగా నిలుస్తుంది. నరసరావుపేటలో నిర్మించిన టిట్కో గృహాలు రాష్ట్రంలోని ఇతర గృహ సముదాయాల కంటే సౌకర్యవంతంగా ఉన్నాయి," అని ఆమె అన్నారు. ప్రభుత్వం తరపున ఈ గృహ సముదాయాల వద్ద ప్రతిరోజు పోలీస్ పెట్రోలింగ్, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, ఉమ్మడి కూటమి నేతలైన కపిలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గూడూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో నరసరావుపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. టిట్కో గృహాల స్వాధీన కార్యక్రమం ద్వారా పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చడంతో పాటు, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి పాఠ్య పుస్తకాలు,ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ సమాజంలో విద్య అనేది జీవితాలను మార్చే శక్తి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతిభావంతులైన విద్యార్థులు ముందుకు సాగేందుకు సహకరించటం మనందరి బాధ్యత. తేజస్విని వంటి విద్యార్థులు వైద్యరంగంలో రాణించి సమాజానికి సేవ చేయాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఇటువంటి బృహత్కర కార్యక్రమానికి పూనుకున్న గుంటూరు పరుచూరి వీర రాఘవులు సేవా సంఘం వారు పుస్తకాల కొనుగోలుకు రూ.10,000 మరియు ఇతర అవసరాల కోసం రూ.5,000 మొత్తంగా రూ.15,000ను విద్యార్థినికి అందించటం అభినందనీయమన్నారు.
సేవా సంఘం అధ్యక్షులు పరుచూరి సంజీవరావు మాట్లాడుతూ... ఎమ్మెల్యే గళ్ళా మాధవి నాయకత్వంలో రాబోయే రోజుల్లో తేజస్విని విద్యాభ్యాసానికి అవసరమయ్యే అన్ని ఖర్చులను భరిస్తాం. విద్యారంగంలో ఇలాంటి సహాయం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్, ఖర్జూర శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యూరోక్రాసీ నాడు - నేడుపై నేడు చర్చా గోష్టి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** నిరుపేదల ఐఏఎస్ గాంధీ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు కీర్తిశేషులు ఎస్.ఆర్.శంకరన్ 91వ జయంతి సందర్భంగా బ్యూరోక్రాసీ నాడు – నేడు అనే అంశం పై జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10:30 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో చర్చా గోష్టి ని నిర్వహిస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగే చర్చా గోష్టి లో వక్తలుగా ఎస్.ఆర్.శంకరన్ జీవిత కృషిపై డాక్టరేట్ పొందిన ఇగ్నో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎం.సౌజన్య, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్, లయోల కాలేజ్ ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాసరెడ్డి లు ప్రసంగిస్తారని తెలిపారు. కీర్తిశేషులు ఎస్.ఆర్. శంకరన్ నిజాయితీగల ఐఏఎస్ అధికారిగా తన జీవితంలో నిరుపేదల ఉన్నతి కోసం చేసిన వెట్టి చాకిరి నిర్మూలన, సఫాయి వృత్తి నిర్మూలన, భూ సంస్కరణల అమలు, కారంచేడు బాధితులకు కాలనీ నిర్మాణము, 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు, షెడ్యూల్ కులాలు, తెగల సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర ప్రభుత్వం, నక్సలైట్ల మధ్య శాంతి చర్చలు, అక్షరాస్యత ఉద్యమం, మద్య వ్యతిరేక ఉద్యమాలలో ఎస్.ఆర్.శంకరన్ చేసిన కృషిని చర్చ గోష్టిలో వక్తలు వివరిస్తారని ఆంధ్రప్రదేశ్ లో బ్యూరోక్రసీ నాడు ఎలా ఉంది, నేడు ఏ విధంగా మారింది వివరిస్తూ చర్చా గోష్టి నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల ఎస్.ఆర్. శంకరన్ అభిమానులు, పేదలు బహుజను ల అభ్యున్నతిని కాంక్షించేవారు బ్యూరోక్రాసీ నాడు – నేడు పై జరిగే చర్చా గోష్టిలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## టీటీడీ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల కరపత్రాన్ని ఆవిష్కరణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల తిరుపతి దేవస్థానములు మరియు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు వివరాలను ప్రకటిస్తూ, రూపొందించిన కరపత్రాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ...భగవద్గీత మనిషి జీవితానికి మార్గదర్శక గ్రంథం. ఇటువంటి పోటీలు యువతలో సత్ప్రేరణ కలిగించడమే కాకుండా, ధర్మం, నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందిస్తాయి" అని తెలిపారు.

## తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా తయారీ: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా తయారు చేశారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆరోపించారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గత ఐదేళ్లు జగన్ పాలనలో లిక్కర్ మాఫియా నడిచి రూ.3,500 కోట్లు దోచుకున్నారని, ఆ అవినీతి బండారాన్ని కప్పిపెట్టేందుకు జగన్ అండ్ కో నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. జోగి రమేష్, జనార్ధనరావు కలిసి చిత్తూరు జిల్లా ములకల చెరువులో కల్తీ మద్యం కుట్ర పన్నారని, జగన్ పాలనలో జే బ్రాండ్ల మద్యం వల్ల 30 వేల మంది చనిపోయి, 30 లక్షల మంది అనారోగ్యానికి గురయ్యారని ల్యాబ్ రిపోర్టులు చెబుతున్నాయని, ఫోరెన్సిక్ పరిశీలనల్లో వైసీపీ నేతల మనీ లాండరింగ్, ఆఫ్రికా దేశాల్లో మద్యం వ్యాపారాల అనుబంధాలు బయట పడ్డాయన్నారు. మిథున్ రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాలో రూ.5 కోట్లు జమ అయినట్లు సిట్ నిర్ధారించిందని, అయినా జగన్ వారిని ఎందుకు సస్పెండ్ చేయలేదని గళ్ళా మాధవి ప్రశ్నించారు. మరోవైపు, కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలను పార్టీ వెంటనే సస్పెండ్ చేసిందని, ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. కల్తీ మద్యం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టి, డిస్టిలరీలు, డిపోలు, మద్యం షాపులు, బార్లలో ఆకస్మిక తనిఖీలు జరుపుతోందని, విశాఖ, గుంటూరు, కర్నూలు, చిత్తూరు, కాకినాడలో కొత్త పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జగన్ పాలనలో నకిలీ మద్యానికి అధికారిక ముద్ర వేసి ఏరులా పారించారని, ఇప్పుడు తమ పాపాలను కప్పిపెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తూ కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని గళ్ళా మాధవి ఘాటుగా విమర్శించారు.

## భారీ వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయింది.వర్షాలు వలన గురువారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. వర్షాల పరిస్థితిపై గురువారం టెలి కాన్ఫరెన్స్ ను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. వర్షాలు పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గండి పడే అవకాశం ఉన్న వాగులు, వంకలు, చెరువులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఉన్నత అధికారులకు తక్షణం సమాచారం అందించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంటలు రక్షించుకునే విధంగా రైతులకు తగు సూచనలు జారీ చేయాలన్నారు. చెరువులు, వాగులు, నదులు వాటి ప్రవాహం ఆధారంగా దాటుటకు, ఈదుటకు ప్రయత్నించవద్దని సూచించారు. వర్షాలు ఉన్నప్పుడు, తర్వాత కూడా తాగునీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్థంబాలు, కరెంట్ షాక్ కు అవకాశం ఉన్న వాటిని గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్థంబాలు, చెట్లు వంటివి పడినపుడు తక్షణం తొలగించాలని అన్నారు. గర్భిణీలు, అత్యవసర వైద్య సేవలు అవసరం ఉన్నవారిని తక్షణం ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. అత్యవసర శస్త్ర చికిత్సలకు విద్యుత్ అంతరాయం ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదని స్పష్టం చేశారు.

**పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించండి:** పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద, నీటి వసతులకు దగ్గరగా ఉండకుండా అందరికీ సమాచారం అందించాలని అన్నారు. రియల్ టైమ్ సమాచారం వస్తుందని, దానిని ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు :** జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండలలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 0863 2234014 ఫోన్ నంబరుతో కంట్రోల్ రూమ్ పని చేస్తుందని చెప్పారు. ప్రజలు సమాచారం అందించవచ్చని, సమాచారం పొందవచ్చని తెలిపారు.
గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ నగరంలో 12, 13 ప్రాంతాల్లో నీరు నిలువ ఉండే అవకాశాలు ఉన్నాయని, అటువంటి ప్రాంతాల్లో సామగ్రితో సిద్ధంగా ఉన్నామన్నారు. హోర్డింగ్ లు వంటివి పడినప్పటికీ తక్షణం తొలగించుటకు సిద్ధం చేశామన్నారు.
తెనాలి, గుంటూరు డివిజన్ లలో చేపట్టిన చర్యలను సబ్ కలెక్టర్ అంజనా సిన్హా, రెవిన్యూ డివిజనల్ అధికారి తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించండి




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కళలను అత్యంత ప్రోత్సాహం అంస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం కల్చరల్ నూతన కమిటీని గురువారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కళాకారులకు పుట్టినిల్లని తెలిపారు. కళలను ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు నాయుడు ముందుంటారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కళాకారులకు తాము అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కల్చరల్ కమిటీ నూతన అధ్యక్షుడుగా డీ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గా కె సురేష్, జనరల్ సెక్రటరీలుగా బి బాల సుబ్రహ్మణ్య చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి విజయ కుమారి, డి పూర్ణచంద్ర శాస్త్రి, సెక్రటరీలుగా వై కిషోర్ శర్మ, సిహెచ్ మీనా కుమారి, అఫీషియల్ స్పోకెన్ పర్సన్ గా డి మనోజ్ఞ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా వి మల్లికార్జున చారి నియమితులయ్యారు.

## ప్రజలకు ప్రతి రూపాయి ఖర్చుపై లెక్క చెప్పి తీరాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి నగర అభివృద్ధి పనులపై ఖర్చుల విషయంలో పారదర్శకత లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఎక్కడ ఎంత ఖర్చు జరుగుతుందో ఎవరికి తెలియదు. మొక్కల నాటడం కోసం 55 లక్షలు అన్నారు, ఇంకొక పనికి 80 లక్షలు అన్నారు, కానీ లెక్కలు స్పష్టంగా లేవు. డీసిల్టేషన్ పనుల బిల్లులు చెల్లించటం లేదు. కొన్ని పనులు పూర్తికాకపోయినా బిల్లులు క్లియర్ అవుతున్నాయి. నా నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయల వర్కులు జరిగితే, ఇప్పటివరకు కేవలం రెండు కోట్ల రూపాయలకే బిల్లులు క్లియర్ అయ్యాయి. మిగతా నిధుల పరిస్థితి తెలియదు, అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజా ప్రతినిధులుగా ఖర్చుల వివరాలు తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, "మున్సిపల్ కార్పొరేషన్ ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క ఉండాలి. పేపర్ల ద్వారానైనా, లేక పోర్టల్ రూపంలో అయినా నగరంలో ఎక్కడ ఎంత నిధులు ఖర్చవుతున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మూడొందల మంది కాంట్రాక్టర్లు ఇప్పటికీ పోర్టల్‌లో నమోదు కాలేదు. కొందరికి ఆమోదం రాలేదు, ఇంకొందరికి బిల్లులు స్టేజీలోనే నిలిచిపోయాయన్నారు. ప్రజల డబ్బు ఎక్కడికి వెళుతుందో, తెలియాలని, మనం ప్రజలకు జవాబుదారితనంగా, ఉండాలని తదుపరి కౌన్సిల్ సమావేశానికి ముందే ఆదాయం, ఖర్చు, వర్కుల వివరాలను పూర్తి పారదర్శకతతో సభ ముందుంచాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

## జగన్ గుట్టును బయటపెట్టింది గూగులే : మోహనకృష్ణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** "చెప్పిన అబద్ధాలు పదేపదే చెప్పడం... ఆ అబద్ధాలతో ప్రజల్ని నమ్మించి మోసం చేయడం వైసీపీ నాయకుడు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. గురువారం జగన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన తీరు దృశ్యం సినిమాను గుర్తుకు తెచ్చింది. నేను ఒక పిచ్చోడిని... మీరు కూడా నా పిచ్చి మాటలు నమ్మండి...అనే విధంగా జగన్... ఆ పార్టీ నాయకులకు తర్ఫీదు ఇచ్చినట్లుగా ఉంది." అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖలో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంటే... దాన్ని జీర్ణించుకోలేని జగన్ అండ్ కో నిన్నటి వరకు దుష్ప్రచారం చేసి... ఇప్పుడు తమవల్లే డేటా సెంటర్ విశాఖకు వచ్చిందన్నట్లుగా బిల్డప్ ఇవ్వడం చూస్తుంటే ఇంతకంటే దిక్కుమాలినతనం మరోకటి ఉంటుందా? మోహన్ కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాదస్తపు మొగుడు చెబితే వినడు గిల్లితే ఏడుస్తాడు అనే విధంగా జగన్ వ్యవహారశైలీ ఉందని, అప్పట్లో కీయా కార్ల కంపెనీ ఏపీకి తెచ్చింది తన తండ్రేనన్నారు... ఇప్పుడు గూగుల్ తానే తెచ్చానంటూ చెప్పుకుంటున్నారు. జగన్ చెప్పే అబద్ధాలకు అంతే లేకుండా పోతుంది. విశాఖలో వస్తుంది గూగుల్ డేటా సెంటర్ కాదు... ఆదానీ డేటా సెంటర్ అని, విశాఖలో పెట్టుబడి పెడుతుంది గూగుల్ కాదు.. ఆదానీ... ఆదానీ కూడా 2019లో చంద్రబాబునాయుడు తేలేదు, తామే 2021లో తెచ్చామని జగన్ చెప్పడం చూస్తుంటే ఆయనలోని పిచ్చి ముదిరి పాకాన పడిందనే విషయం అర్థమౌతుంది. జగన్‌ను ఉన్న పళంగా పిచ్చి ఆసుప్రతికి తరలించి మంచి వైద్యం చేయించాలి లేదంటే ఈ దేశానికి స్వతంత్రం కూడా తనవల్లే వచ్చిందనే విధంగా మాట్లాడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి... సొంత కంపెనీల ద్వారా మద్యం సరఫరా చేయించి ప్రజాధనాన్ని గుటుక్కున మింగిన వ్యక్తి గూగుల్ తెచ్చారా..? డేటా సెంటర్ అంటే దానికేం సీన్ లేదు.. అదో గొడౌన్ మాత్రమేనని తన పత్రికలో రాయించిన జగన్... మళ్లీ దాన్ని తెచ్చిందీ తానేనని చెప్పుకోవడం సిగ్గుచేటు. విశాఖకు గూగుల్ రావడాన్ని వైసీపీ తప్పా అందరూ స్వాగతిస్తున్నారు. గూగుల్‌లో 6093 అని కొడితే జగన్‌రెడ్డి జైలు జీవితం మొత్తం బయటకొస్తోంది. గూగుల్ టేకవుట్ టెక్నాలజీ ద్వారా వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిని సీబీఐ గుర్తించింది. జగన్‌రెడ్డి అండ్ కో గుట్టురట్టు చేసిందని గూగుల్‌పై కోపం పెంచుకొని ఉంటారు. రాజా ఆఫ్ కరప్షన్ అని కొట్టినా జగన్ చరిత్రనే గూగుల్ చూపిస్తోంది. తండ్రిని అడ్డుపెట్టుకుని వేల కోట్లు దోపిడీ చేసిన అవినీతి చరిత్ర బయటకు వస్తోంది. అందుకనే గూగుల్ అంటేనే కడుపుమంటతో జగన్ అండ్ కో రగిలిపోతున్నాడు. ఐదేళ్ల తన పాలనలో కల్తీ మద్యం అమ్మి రూ.3,500 కోట్లు దోచుకున్నాడు. ఆ అవినీతి బండారాన్ని కప్పిపెట్టేందుకు నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. కల్తీ మద్యం తయారీకి అద్యుడు జగన్, వైసీపీ నేతలే. సెప్టెంబర్ 24న ఆఫ్రికా వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్ధన్‌రావును.. 23న జోగి రమేష్ ఇంటికి పిలిపించుకోవడం అనుకోకుండా జరిగింది కాదు. జోగి రమేష్, జనార్ధన్‌రావు చిన్ననాటి స్నేహితులు, కల్తీ మద్యం వ్యాపారానికి వీళ్లిద్దరి ప్రణాళికే ఆధారం. రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో ఆఫ్రికాలో కల్తీ మద్యం వ్యాపారం నిజం కాదా? కల్తీ మద్యం తయారీ కంపెనీని కామెరూన్ ప్రభుత్వ మంత్రి సీజ్ చేసిన విషయం నిజం కాదా? వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి.. జగన్ బినామీలు కాదా?. కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంతో ఎవరికి సంబంధం ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల ఆరోగ్యం, భద్రత పట్ల పూర్తి ప్రాధాన్యత ఇస్తుంది. వైసీపీ నేతలు చేస్తున్న అబద్ధపు ప్రచారానికి ప్రజలు మోసపోవద్దు.' అని మోహనకృష్ణ కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మన్యంలో మదపుటేనుగుల దాడుల నిరోధంపై దృష్టిపెట్టండి

- ఏనుగుల కదలికలపై నిరంతర నిఘా అవసరం
- ఒడిశా నుంచి వచ్చే ఏనుగులను తిరిగి మళ్లించే చర్యలు తీసుకోండి
- రాష్ట్ర సీతాకోక చిలుకగా తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ గుర్తింపునకు ప్రతిపాదన
- జాతీయ వన్య ప్రాణి బోర్డు సమావేశానికి జాతీయ రహదారులకు అటవీ భూముల సేకరణ నివేదిక
- రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్



**పార్వతీపురం(జర్నలిస్ట్ ఫైల్):** పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ప్రాంతానికి ఒడిశా వైపు నుంచి వస్తున్న మదపుటేనుగుల సమస్యను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశించారు. మన్యంలో ఏనుగుల సంచారం వల్ల జరుగుతున్న పంట నష్టం, ప్రాణ నష్టంపై నివేదిక ఇవ్వాలని సూచించారు. మదపుటేనుగుల గుంపుల జాడను ఎప్పటికప్పుడు తెలుసుకుని పంటలకు నష్టం వాటిల్లకుండా వాటిని మళ్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారి అధ్యక్షతన రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తీసుకోవాల్సిన అటవీ అనుమతులు, ఉత్తరాంధ్ర ప్రాంతంలో మనుషులు, జంతువుల మధ్య జరుగుతున్న సంఘర్షణలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దుల్లో మదపుటేనుగుల సంచారం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒడిశా వైపు రాష్ట్రంలో ప్రవేశించిన రెండు గుంపులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని క్షేత్ర స్థాయి నుంచి తెలిసింది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలి. ట్రాకర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా వాటిని తిరిగి అడవిలోకి మళ్లించాలి. ఒడిశా వైపు నుంచి వస్తున్నాయి కాబట్టి అవసరం అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వాటిని వెనక్కి పంపే విధంగా చర్యలు తీసుకోవాలి.

**అటవీ భూముల సేకరణపై జాతీయ వన్యప్రాణి బోర్డుకు నివేదిక :** రాష్ట్ర పరిధిలో పలు జాతీయ రహదారుల నిర్మాణానికి అటవీ భూములు అవసరం అవుతాయి. అటవీ భూములతో పాటు ఎకో సెన్సిటివ్ జోన్, టైగర్ రిజర్వ్ జోన్ పరిధిలో ఉన్న భూములను దీని నిమిత్తం సేకరించాల్సి ఉంది. బద్వేల్, నెల్లూరు మధ్య 67వ నంబర్ నాలుగు లైన్ల జాతీయ రహదారి నిమిత్తం 34.67 హెక్టార్ల అటవీ భూమి అవసరం ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్ లో ఉంది. ఈ భూములను బదిలీ చేసేందుకు జాతీయ వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి కోసం పంపించనున్నాం. బెంగళూరు, కడప, విజయవాడ ఎక్స్ ప్రెస్ కారిడార్ కోసం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ తో పాటు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ నుంచి 40.86 హెక్టార్ల భూమి బదిలీ చేసేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇండియా అనుమతులతో పాటు జాతీయ వన్య ప్రాణి బోర్డుకు నివేదిక అందజేయనున్నాం. ఈ నెల 29వ తేదీన గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి అధ్యక్షతన జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశానికి పై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో కనిపించే అరుదైన సీతాకోక చిలుక అయిన తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ సీతాకోక చిలుకను... రాష్ట్ర సీతాకోక చిలుకగా గుర్తించాలని జాతీయ వన్య ప్రాణి బోర్డు ప్రతిపాదన పంపుతున్నామ”న్నారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్, పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ డాక్టర్ పి.వి. చలపతిరావు, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, అడిషనల్ డి.జి. ఎన్. మధుసూదన్ రెడ్డి, ప్రముఖ శాస్త్రవేత్తలు దీపా జైశ్వాల్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాళ్లంతా చంద్రబాబు మనుషులే



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నకిలీ మద్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై తాజాగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. నకిలీ మద్యం వెనుక ఉన్న వాళ్లంతా సీఎం చంద్రబాబు మనుషులేనని వ్యాఖ్యానించారు. నిందితుడు జనార్ధన్ రావుతో అబద్దాలు చెప్పించారని ఆరోపించారు. తప్పు చేసి ఆ నెపాన్ని అవతలి వాళ్లపై నెట్టడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు.


కాగా నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడు జనార్ధన్ రావు అరెస్టైన విషయం తెలిసిందే. అయితే కేసు విచారణలో జనార్ధన్ రావు సంచలన విషయాలు వెల్లడించారు. మరో నిందితుడు జయచంద్రారెడ్డి, తన మధ్య ఉన్న సంబంధాలను పూసగుచ్చినట్లు తెలిపారు. జయచంద్రారెడ్డి, తాను మద్యం వ్యాపారులమని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే నకిలీ మద్యం నడిచిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ మద్యం వ్యాపారం మూసివేశామని తెలిపారు. కానీ మాజీ మంత్రి జోగి రమేశ్ ఫోన్ చేసి మళ్లీ ప్రారంభించమని చెబితే ములకచెరువులో నకిలీ మద్యం తయారు చేశామని చెప్పారు. అంతేకాదు నకిలీ మద్యం తయారీపై కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ఎన్నికలకు ముందే కుట్ర చేశారని జనార్ధన్ రావు తెలిపారు. దీంతో ఈ వ్యాఖ్యలను జోగి రమేశ్ ఖండించారు. జయచంద్రారెడ్డి ఎవరో తనకు తెలియదన్నారు. కూటమి ప్రభుత్వమే నెపాన్ని తమపై నెడుతోందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఇదే వ్యాఖ్యలు జగన్ కూడా చేశారు. ప్రస్తుతం నకిలీ మద్యం కేసులో రోజుకో సంచలనం వెలుగులోకి వస్తుంది. చూడాలి మరి చివరికి ఏం జరుగుతుందో.

## టెట్ మినహాయింపుకై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సెప్టెంబర్ 1 న సుప్రీంకోర్టు విద్యా హక్కు చట్టం అమలు 2010 కు పూర్వం ఉన్న ఉపాధ్యాయులు కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ కచ్చితంగా పాస్ కావాలని తీర్పు నిచ్చింది. 2017 న కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టంలో పొందుపరిచినట్లు అందరూ పాస్ కావాలని నిబంధనను గుర్తుచేస్తూ తీర్పునిచ్చింది. కచ్చితంగా ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ కావాలని ఇచ్చిన తీర్పుపై న్యాయ సమీక్ష చేసి, పరీక్ష పాస్ నుండి మినహాయింపు ఇవ్వాలని సుప్రీంకోర్టులో ఏపీటీఎఫ్ పక్షాన రివ్యూ పిటిషన్ R.P.(C) Diary No:61041/2025 ద్వారా దాఖలు చేసినట్లు ఏపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసి టెట్ మినహాయింపు కోసం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా 2017లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టంలో 2010కి పూర్వం ఆయా డీఎస్సీల ద్వారా నియామకమైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరికీ టెట్ పాస్ కావడం నుండి మినహాయింపు ఇచ్చే లాగున సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఏపీటీఎఫ్ పక్షాన ప్రభుత్వాన్ని కోరారు.

## కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగనే అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు అంత కోపం ఎందుకుని ప్రశ్నించారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

“రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కష్టపడుతున్నారు. విశాఖను ఐటీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నారు. వైకాపా నేత జోగి రమేశ్‌తో నకిలీ మద్యం కేసు నిందితుడు జనార్ధన్‌రావు మాట్లాడింది నిజం కాదా? తప్పు చేసినవారు ఎవరైనా మా పార్టీ ఊరుకోదు. మా పార్టీ నేతలు తప్పు చేసినా వెంటనే చర్యలు తీసుకుంటారు. నాణ్యమైన మద్యం సరఫరా చేసేందుకు మేం అనేక చర్యలు తీసుకున్నాం. జూదంపై జగన్ ఇప్పుడు మాట్లాడుతున్నారు.. మీ హయాంలో ఏం చేశారు? గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. మా నియోజకవర్గంలో జూదం జరుగుతోందని లేఖ రాస్తే కనీస స్పందనలేదు. జూదం ఎక్కడ జరిగినా కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుంది. పార్ట్‌టైమ్ విజిటర్‌గా వచ్చి మాపై దుష్ప్రచారం చేయడం తగదు” అని విమర్శించారు.

## బంగ్లాదేశ్ ప్రభుత్వానికి లేఖ..



అమరావతి: మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్ నావికాదళం అదుపులో ఉన్న మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామని, అక్కడి ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశామని తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులను వెనక్కి రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. విదేశాంగ మంత్రిత్వశాఖ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయని వివరించారు. మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి రక్షణ కవచంలా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## పదవ తరగతి ఉర్దూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ విడుదల



**నంద్యాల(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ మీడియంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో స్టడీ మెటీరియల్ ను విడుదల చేశారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సి ఈ డి ఎం ) ఆంధ్రప్రదేశ్ శాఖ రూపొందించిన ఉర్దూ మీడియం పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను రాష్ట్ర న్యాయ మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గురువారం నంద్యాలలో ఆవిష్కరించారు. సిఈడిఎం సంచాలకుడు (ఎఫ్ఏసి), రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ,ఎండి యాకుబ్ భాష అధ్యక్షతన స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మైనారిటీ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, పదవ తరగతి పాస్ అయితే జీవితం కూడా సగం పాస్ అయినట్లేనని అందువలన ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి పాస్ కావాలనే సంకల్పంతో నిష్ణాతులచే స్టడీ మెటీరియల్ రూపొందించడం జరిగిందని అన్నారు. మైనారిటీలకు ఉన్నత విద్యతో పాటు, యు పి ఎస్ సి, ఏపీపీఎస్సీ, టెట్, నీట్,డీఎస్సీ లాంటి ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ తో కూడిన చర్యలను అమలు చేస్తున్నదని అన్నారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సిఈడిఎం కేంద్రాల ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఉచిత విద్య,ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఉర్దూ విద్యార్థుల కోసం రూపొందించిన స్టడీ మెటీరియల్ ను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఉర్దూ పదవ తరగతి విద్యార్థులకు సిఈడియం ద్వారా పంపుతున్నట్లు, అందుకు తగిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సంచాలకుడు యాకూబ్ భాషను మంత్రి ఫరూక్ ఆదేశించారు. రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఫరూక్ ఆకాంక్షించారు. సిఈడిఎం సంచాలకుడు యాకుబ్ భాష మాట్లాడుతూ మైనారిటీ మంత్రి ఫరూక్ ప్రత్యేక చొరవతో పబ్లిక్ పరీక్షలకు ఆరు నెలల ముందుగానే ఉర్దూ స్టడీ మెటీరియల్ ను రూపొందించడం జరిగిందని, నవంబర్ 5వ తేదీ లోపు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఉర్దూ పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.అనంతరం నంద్యాల అసెంబ్లీ పరిధిలో ఉర్దూ మీడియం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను మంత్రి ఫరూక్ చేతుల మీదుగా సిఈడిఎం అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, జిల్లా ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి అస్మద్దీన్, పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలోనే నకిలీ మద్యం మూలాలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో మద్యం మూలాలన్నీ జగన్ ప్రభుత్వంలోనివేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం విధానాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఒక్క బాటిల్ అయినా స్కాన్ చేశారా ? అని జగన్ ను సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 30 వేల కేసులు ఎన్డీపీఎల్ నమోదైన విషయాన్ని మర్చిపోయారా అని నిలదీశారు. కల్తీ మద్యం విషయంలో వేళ్లన్నీ జోగి రమేష్ వైపే దోషిగా చూపిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం సురక్ష యాప్ ద్వారా నకిలీలను గుర్తించే విధానాన్ని తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో హానికరమైన రసాయనాలు ఉన్నట్లు కేంద్రమే స్పష్టం చేసిందని చెప్పారు. జగన్ మద్యానికి జంగారెడ్డిగూడెంలో 27 మంది బలైన విషయాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. ప్రస్తుతం పీపీపీ పద్ధతిలో 10 మెడికల్ కాలేజీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీని ద్వారా వైద్య విద్య బలోపేతం కానుందని స్పష్టం చేశారు. రాబోయే రెండు, మూడేళ్లలో 1750 మెడికల్ సీట్లను అందుబాటులో తీసుకు రానున్నట్లు తెలిపారు. అందులో 220 సీట్లు రాష్ట్రానికి వస్తాయని వెల్లడించారు. 110 సీట్లు కన్వీనర్ కోటాలో మెరిట్ స్టూడెంట్స్ కు అందించేటు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ రిజర్వేరీషన్ పద్ధతితో వైద్య విద్య అందనుందని స్పష్టం చేశారు. పీపీపీ పద్ధతిలో 33 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. అభివృద్ధి అనంతరం ప్రభుత్వ ఆస్తిగా మారుతుందని, దీనిపై జగన్ దుష్ప్రచారం దారుణమని మండిపడ్డారు.

## అమరావతిలో విపత్తు నిర్వహణ ప్రణాళిక

APCRDA

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రాజధాని అమరావతిలో విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. ప్రపంచబ్యాంకు నిధులిస్తున్న నేపథ్యంలో అమరావతి రాజధానిలో విపత్తు నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని నిబంధనల్లో పేర్కొంది. దీనిలో భాగంగా రాబోయే 30 సంవత్సరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన నివేదికను తయారు చేయాల్సి ఉంటుంది. అమరావతి రాజధానిలో కొండవీటివాగు, కృష్ణానది, భారీ వర్షాలు, తుఫానుల నుండి తీసుకోవాల్సిన రక్షణ చర్యలను కన్సల్టెన్సీ సంస్థ రూపొందించాలి ఉంటుంది. అలాగే భూకంపజోన్-3లో ఉండటంతో దానికి అనుగుణంగా భవనాల నిర్మాణంపైనా ప్రత్యేక నివేదికను రూపొందించాలి. అమరావతిలో నిర్మించే భవనాలు భూకంపాలను, ఇతర ప్రకృతి విపత్తులను తట్టుకునేలా ఉండాలని 2017 నవంబరు 17వ తేదీన ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాల ప్రకారమూ విపత్తు నిర్వహణ ప్లాను తప్పనిసరిగా రూపొందించాల్సి ఉంది. ప్రణాళికలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులకు సంబంధించిన నివేదికను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ నివేదికలో వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాల్సి ఉంటుంది. అలాగే ముంపు ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు, సంస్థల జాబితానూ ఎప్పటికప్పుడు రూపొందించాల్సి ఉంటుంది. అమరావతిలో కొత్తగా కన్సల్టెన్సీని నియమించాలనే నిర్ణయం చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి విపత్తుల ప్లాను ఉందని, వరదల ముంపు నివారణ కోసం ఉండవల్లి వల్ల లిఫ్టు ఏర్పాటు చేశారని, మరలా కొత్తగా కన్సల్టెన్సీ చేయాల్సిందేమిటనే దానిపై రైతుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## కేశినేని, కొలికపూడి వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా పరిగణించారు. కొందరు నేతల వైఖరి, సోషల్ మీడియాలో రచ్చపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. బహిరంగ విమర్శలు, వివాదాలు సృష్టించే వ్యాఖ్యలపై సీరియస్ అయ్యారు. ఈమేరకు దుబాయ్ నుంచి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు.

ఇద్దరు నేతలను పిలిచి మాట్లాడుతానని చంద్రబాబుకు పల్లా శ్రీనివాసరావు చెప్పగా.. వారితో మాట్లాడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసినట్టు తెలిసింది. యూఏఈ నుంచి వచ్చాక తానే దృష్టి పెడతానని చెప్పినట్టు సమాచారం. కొందరు నేతలు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఏమైనా సమస్యలుంటే పార్టీ అంతర్గత వేదికలపై చర్చించాలని సూచించారు. దుబాయ్ నుంచి సీఎం ఇచ్చిన ఆదేశాలతో శుక్రవారం జరపాల్సిన తిరువూరు పంచాయితీ, ఉమ్మడి కృష్ణా జిల్లా నేతల సమావేశాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రద్దు చేశారు.

## వలంటీర్లు పబ్లిక్ సర్వెంట్లు కాదు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** వలంటీర్లు పబ్లిక్ సర్వెంట్ నిర్వచన పరిధిలోకి రారని హైకోర్టు వ్యాఖ్యానించింది. వలంటీర్లు కేవలం ప్రభుత్వ పథకాల సేవల్ని అందజేస్తున్నారని, వాళ్లు పొందేది గౌరవ వేతనం మాత్రమేనని గుర్తు చేసింది. ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై గుంటూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలు చేసిన క్రిమినల్ కేసు విచారణార్హతపై హైకోర్టు సందేహాన్ని వ్యక్తం చేసింది. పవన్ కళ్యాణ్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు సంబంధించిన పిటిషన్ ఇతర వివరాలు అందజేయాలని పిటిషనర్‌ను జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఆదేశించారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. వారాహి యాత్రలో భాగంగా పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ వలంటీర్లు సేకరించిన సమాచారం అసాంఘీక శక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల మహిళలు అపహరణ జరుగుతోందని విమర్శించారు. దీనిపై అప్పటి వైసిపి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐపిసి సెక్షన్ 499, 500 కింద గుంటూరు కోర్టులో పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు దాఖలయింది. పవన్ విమర్శలు తమ ప్రతిష్టకు విఘాతం చేకూర్చేలా ఉన్నాయంటూ ఐదుగురు వలంటీర్ల అఫిడవిట్లను జత చేసింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పవన్ కళ్యాణ్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతించాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను గుంటూరు కోర్టు అనుమతిచ్చింది. కింది కోర్టు నిర్ణయం చట్ట వ్యతిరేకమంటూ సరళ సహా నలుగురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ వేశారు. వీరి తరపున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ వలంటీర్లు పబ్లిక్ సర్వెంట్ నిర్వచనం పరిధిలోకి వస్తారని తెలపడంపై హైకోర్టు పైవిధంగా ప్రశ్నించింది. క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసే అర్హత పిటిషనర్లకు లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతివాదన చేశారు. విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి



**ప్రత్తిపాడు నియోజకవర్గం (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం లో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బి. రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గా ఎంఎల్ఏ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈపాటికి 10 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. కాంట్రాక్టర్ లు సకాలంలో బిల్లు లు చెల్లించడం లేదని ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని ఆయన కోరారు. గోరంట్ల కొండ పై నుండి మంచి నీటి సరఫరా కోసం చేస్తున్న పనులకు సంబంధించి వివరణ కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467